Follow: @ANNTELUGU

ANN తెలుగు

06-03-2026

# మహా పత్రిక

శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 68 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## విజయ్- రష్మిక దంపతులకు సీఎం రేవంత్ శుభాకాంక్షలు

### ఇంటికి వెళ్ళి అభినందనలు

హైదరాబాద్, మహా : టాలీవుడ్ సెన్సేషన్ విజయ్ దేవరకొండ నివాసానికి గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెళ్ళారు. ఇటీవల వివాహ బంధంతో ఒక్కటైన విరోష్ (విజయ్‌రష్మిక) జంటను ఆశీర్వదించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా వారి నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన దంపతులు నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. బుధవారం వెడ్డింగ్ రిసెప్షన్ కు ఢిల్లీలో ఉన్న కారణంగా హాజరుకాకపోవడంతో గురువారం స్వయంగా ఇంటికి వచ్చి ఆశీర్వదించారు.


**టాప్ న్యూస్**



### కుటుంబ నియంత్రణ వద్దు

- ఎక్కువ పిల్లలు ముద్దు
- ప్రోత్సాహకాలు ప్రకటించిన చంద్రబాబు
- ఇద్దరికంటే ఎక్కువ కంటే కాన్పు సమయంలో రూ.25వేలు

02



### మమతకు షాక్

- మీ గవర్నర్ ను మార్చేశామని అమిత్ షా ఫోన్
- బెంగాల్ గవర్నర్ గా మరో కాంట్రవర్సీ కింగ్

02



### ఔను.. నిజమే

- షాకిచ్చిన విజయ్ త్రిష

02

## థ్రిల్లింగ్ మ్యాచ్‌లో టీమిండియా సూపర్ విక్టరీ

### టీ 20 వరల్డ్ కప్ ఫైనల్ కు భారత్

- ముంబైలో జరిగిన మ్యాచ్ లో ఇంగ్లండ్ పై గెలుపు
- మరోసారి బ్యాట్ తో రాణించిన సంజూ శాంసన్.. హార్దిక్ పాండ్యా సూపర్ గేమ్



**ముంబై, మహా :**

టీ20 ప్రపంచకప్‌లో టీమిండియా ఫైనల్‌కు చేరింది. ముంబైలోని వాంఖడే స్టేడియంలో ఇంగ్లండ్‌తో జరిగిన థ్రిల్లింగ్ సెమీఫైనల్ మ్యాచ్‌లో గెలుపొందింది. ఏడు పరుగుల తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించింది. భారీ టార్గెట్ తో బరిలోకి దిగిన ఇంగ్లండ్ చివరి ఓవర్ వరకు మ్యాచ్‌లోనే ఉంది. జాకబ్ బెతెల్ (48 బంతుల్లో 105) అద్వితీయ పోరాటం చేశాడు. అయితే చివర్లో ఇంగ్లండ్ ఒత్తిడికి తలవంచింది. దీంతో విజయం సాధించిన టీమిండియా ఆదివారం అహ్మదాబాద్‌లో జరగబోయే ఫైనల్ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో తలపడనుంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు సంజు శాంసన్ అదిరిపోయే ఆరంభాన్ని అందించాడు. తన సూపర్ ఫామ్‌ను కొనసాగిస్తూ 42 బంతుల్లో 7 సిక్స్‌లు, 8 ఫోర్లతో మిగతా 2లో

టీమిండియా 20 ఓవర్లకు
**253/7**
రాణించిన సంజు
(42 బంతుల్లో 89)
శివమ్ దూబె
(24 బంతుల్లో 43)

7 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌పై గెలుపు
పోరాడి ఓడిన ఇంగ్లండ్
20 ఓవర్లలో
**246/7**
అద్భుతంగా పోరాడిన బెతెల్

## బీహార్ పాలిటిక్స్‌లో నూతన శకం

### ముఖ్యమంత్రి పదవికి నితీష్ గుడ్ బై

రాజ్యసభలో అడుగుపెట్టాలని కీలక నిర్ణయం.. కేంద్ర రైల్వేశాఖ అప్పగించే అవకాశం
బీహార్ లో నితీష్ వారసుడి కోసం పోటీ.. తొలిసారి బీజేపీకి దక్కనున్న సీఎం పదవి



**పాట్నా, మహా :**


పదే పదే రాజీనామా చేస్తూ పదిసార్లు బీహార్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన రాజకీయ దురంధరుడు నితీష్‌కుమార్ మరోసారి బీహార్ సీఎం పదవికి రాజీనామా చేశారు. ఎగువ సభలోనూ ప్రాతినిధ్యం వహించాలన్న తన చిరకాల కోరికను నెరవేర్చుకునేందుకు సీఎం పదవిని త్యాగం చేశారు. అంతే కాకుండా రెండు దశాబ్దాలుగా బీహార్ ప్రజలకు సేవచేసే అవకాశం ఇచ్చినందుకు ప్రజలకు కృతజ్ఞత చెప్తూ, రాబోయే కొత్త ప్రభుత్వానికి తన పూర్తి మద్దతూ, సహకారం ఉంటుందని చెప్పారు. రాజకీయాల్లోకి రాకముందు నుంచీ బీహార్ చట్టసభలో రెండు సభలకూ, పార్లమెంటులో కూడా ఎగువ దిగువ సభలకు ప్రాతినిధ్యం వహించాలని తనకు కోరిక ఉందని ఇప్పుడది నెరవేరబోతోందని కూడా చెప్పేశారు. ఇప్పటికే నితీష్‌కేంద్ర రైల్వేశాఖ మంత్రి గా పనిచేసినప్పుడు లోక్ సభ నుంచే ప్రాతినిధ్యం వహించారు. బీహార్ అసెంబ్లీ, ఎగువ సభ సభ్యుడుగా కూడా ప్రాతినిధ్యం వహించారు.

#### తర్వాత ఎవరు?

ఇప్పుడు అందరి ఆసక్తీ నితీష్ తరువాత బీహార్ కొత్త ముఖ్యమంత్రి ఎవరు అనే చర్చ జోరందుకుంది. నితిష్ కంటే ముందు బీహార్ సీఎంగా లాలూ ప్రసాద్ యాదవ్ ఉన్న సమయంలో జంగిల్ రాజ్ గా పేరుపడ్డ బీహార్ ను నితీష్‌గాడిన పెట్టే ప్రయత్నం చేసారు. అభివృద్ధి మంత్రంతో నాలుగు సార్లు ముఖ్యమంత్రి అయ్యారు. బీజేపీ మిత్రపక్షంగా, ఎన్డీయే భాగస్వామికి మొదట సీఎంగా కొనసాగిన నితీష్ పొత్తు ఏ పార్టీతో వున్నా మిగతా 2లో

## రాజ్యసభ సభ్యులుగా వేం నరేందర్ రెడ్డి, అభిషేక్ సింఘ్వీ నామినేషన్‌లు

హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, శ్రీధర్ బాబు
16మంది ప్రయత్నించినా.. జాతీయ, రాష్ట్ర అవసరాల రీత్యా హైకమాండ్ నిర్ణయం
నాడు వైఎస్ కేవీపీ జోడీలా నేడు రేవంత్ వేం జోడీ.. సీఎం, రాజ్యసభ పదవులపై చర్చ



హైదరాబాద్, మహా : రాష్ట్రం నుంచి రాజ్యసభ అభ్యర్థులుగా అభిషేక్ మనుసింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు నేతృత్వంలో అసెంబ్లీ ప్రాంగణానికి చేరుకున్న మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి ఎన్నికల అధికారి ఉపేందర్‌రెడ్డికి నామినేషన్ పత్రాలు అందించారు. దీనికి సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ హాజరయ్యారు. నామినేషన్ వేస్తున్న అభ్యర్థులకు మద్దతుగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు పెద్ద ఎత్తున అసెంబ్లీ ప్రాంగణానికి చేరుకున్నారు. రాష్ట్రంలో ఖాళీ అయిన రెండు స్థానాలకు కాంగ్రెస్ అధిష్ఠానం మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డికి అవకాశం కల్పించింది. ముఖ్యమంత్రి రేవంత్‌కు అత్యంత సన్నిహితుడైన వేం నరేందర్ రెడ్డికి పదవి దక్కడంతో ముఖ్యమంత్రి మద్దతుదారుల్లో, ఆదినుండీ సీఎం వెంట నడిచిన నేతలు, అనుచరుల్లో ఉత్సాహం వ్యక్తమైంది. కాంగ్రెస్ అధికారంలో రావడానికి కీలకంగా పనిచేసిన వేం నరేందర్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీలో అందరివాడుగా పేరుంది.

#### ఏకగ్రీవమే.. నేడు స్క్రూటినీ

తెలంగాణలో రెండు రాజ్యసభ స్థానాలు ఏకగ్రీవం కానున్నాయి. ఈ స్థానాల ఎన్నిక కోసం నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. కాంగ్రెస్ తరఫున అభిషేక్ సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేయగా స్వతంత్ర అభ్యర్థిగా సాయి అనే వ్యక్తి మిగతా 2లో

## కొత్త సుప్రీం లీడర్ ఎన్నికలో నన్నూ చేర్చుకోవాలి

### అక్కడి నాయకత్వం మాకు ఆమోదయోగ్యం కాదు: ట్రంప్



మహా : ఇరాన్ తదుపరి సుప్రీం లీడర్ ఎన్నికలో తన పాత్ర కూడా ఉండాలని భావిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా ప్రమేయం లేకుండా సుప్రీం నేతను నియమించేందుకు యత్నిస్తే.. ఇరాన్ తన సమయాన్ని వృథా చేసుకుంటున్నట్లేనని ఓ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. ఇటీవల దాడుల్లో మృతి చెందిన ఆయతుల్లా అలీ ఖమేనీ కుమారుడు ముజ్తబా ఖమేనీ తదుపరి సుప్రీంగా ఎన్నికయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయని, అయితే ఇది తనకు ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. ఇరాన్‌లో శాంతి, సామరస్యాలు నెలకొల్పే వ్యక్తిని తాము కోరుకుంటున్నట్లు ట్రంప్ చెప్పారు. పాత నాయకత్వం విధానాలనే కొనసాగించే నేతను తిరస్కరిస్తానని తెలిపారు. లేకపోతే ఐదేళ్లలో ఇరాన్‌కు అమెరికాతో మళ్లీ వివాదం తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

## ఐదు రాష్ట్రాల ఎన్నికలకు ముందు.. కేంద్రం సంచలనం

### పది రాష్ట్రాల గవర్నర్ల మార్పు

- తెలంగాణ నూతన గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా
- మహారాష్ట్రకు జిష్ణుదేవ్.. బెంగాల్ కు ఆర్ ఎన్ రవి
- తమిళనాడు, కేరళ, ఢిల్లీ సహా పలురాష్ట్రాలు ఛేంజ్

హైదరాబాద్, మహా: ఐదు రాష్ట్రాల ఎన్నికలకు ముందు కేంద్రం ట్విస్ట్‌ల మీద ట్విస్ట్‌లు ఇస్తోంది. ఎన్నికలు జరగనున్న పశ్చిమబెంగాల్, కేరళ, తమిళనాడు రాష్ట్రాల గవర్నర్లను మార్చేసింది. వీటితో పాటు అనేక కీలకరాష్ట్రాల గవర్నర్లను మార్చింది. మిగతా 2లో

## నేడు ఆదిలాబాద్‌లో మంత్రి జూపల్లి పర్యటన

వివరాలు 2లో



## థ్రిల్లింగ్ మ్యాచ్‌లో
# టీమిండియా సూపర్ విక్టరీ

(మొదటిపేజీ తరువాయి)

89 పరుగులు చేశాడు. అభిషేక్ (9) తప్ప మిగతా బ్యాటర్లు అందరూ దూకుడుగా ఆడి పరుగులు సాధించారు. శివమ్ దూబె (25 బంతుల్లో 43), ఇషాన్ కిషన్ (18 బంతుల్లో 39), హార్దిక్ పాండ్యా (12 బంతుల్లో 27) బౌండరీలతో హోరెత్తించారు. దీంతో టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 253 పరుగులు చేసింది. ఇంగ్లండ్ బౌలర్లలో రషీద్, విల్ జాక్స్‌కు రెండేసి వికెట్లు దక్కాయి .

254 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్ ఆరంభంలో వికెట్లు కోల్పోయినా బెతెల్ ఓ గుర్తుంచుకోదగిన ఇన్నింగ్స్ ఆడాడు . టీ20 ప్రపంచ కప్‌లోనే రెండో వేగవంతమైన సెంచరీ (45 బంతుల్లో) చేశాడు. అయితే చివరి ఓవర్లో హార్దిక్ విసిరిన అద్భుతమైన త్రోకు రనౌట్ కావడంతో మ్యాచ్ భారత్ వైపు మొగ్గింది. దీంతో ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 246 పరుగులు చేసింది. మొత్తం ఈ మ్యాచ్‌లో 500కు పైగా పరుగులు నమోదయ్యాయి. టీమిండియా బౌలర్లు భారగా పరుగులు సమర్పించుకున్నారు. హార్దిక్ రెండు వికెట్లు తీశాడు.

**చెలరేగిన భారత బ్యాటర్లు**

టీమిండియా స్టార్ బ్యాటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగిపోయారు. చావో రేవో తేల్చుకోవాల్సిన కీలక మ్యాచ్‌లో బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడారు. ఈ మ్యాచ్‌లో టీమిండియా స్టార్ ఓపెనర్ సంజూ శాంసన్ మరోసారి రెచ్చిపోయారు. సిక్సులు, ఫోర్లతో ఇంగ్లండ్ బౌలర్లకు చెమటలు పట్టించారు. మొత్తంగా ఏడు సిక్సులు, ఎనిమిది ఫోర్లతో సంజూ(89) పరుగులు చేశారు. శాంసన్ వీరవిహారంతో ప్రత్యర్థి బౌలర్లు నిస్సహాయులుగా మిగిలిపోయారు. సంజూతో పాటు శివమ్ దూబే (43), ఇషాన్ కిషన్ (39), హార్దిక్ పాండ్యా (27), తిలక్ వర్మ (21) అద్భుతంగా రాణించారు. సంజూ శాంసన్ పరుగుల మెషిన్ లా అలవోకగా ఆడాడు. ఫీల్డింగ్ కూడా గణనీయంగా మెరుగుపడింది. ఇంగ్లాండ్ ను సరైన సమయంలో కట్టడిచేశారు.

## రాజ్యసభ సభ్యులుగా వేం నరేందర్ రెడ్డి,
# అభిషేక్ సింఘ్వీ నామినేషన్‌లు

(మొదటిపేజీ తరువాయి)

నామినేషన్ వేశారు. అభిషేక్ సింఘ్వీ మూడుసెట్లు, వేం నరేందర్‌రెడ్డి నాలుగు సెట్లు, సాయి ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. అయితే స్వతంత్ర అభ్యర్థి 10 మంది ఎమ్మెల్యేల సంతకాలు లేకుండా నామినేషన్ వేయడంతో శుక్రవారం జరిగే స్క్రూటినీలో అది తిరస్కరణకు గురి కానుంది. దీంతో సింఘ్వీ, వేం నరేందర్ ఏకగ్రీవం లాంఛనం కానుంది.

**సీఎం సలహాదారు పదవికి వేం నరేందర్ రెడ్డి రాజీనామా**

సీఎం రేవంత్ రెడ్డికి రాజకీయ సలహాదారుగా వ్యవహరిస్తున్న వేం నరేందర్‌రెడ్డి తన పదవికి ఇవాళ రాజీనామా చేశారు. కాంగ్రెస్ పార్టీ తరపున రాజ్యసభ అభ్యర్థిగా ఆయన నామినేషన్ దాఖలు చేయనున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రాజ్యసభ అభ్యర్థిగా పోటీ చేసే వ్యక్తి లాభదాయక పదవుల్లో ఉండకూడదనే నిబంధన ఉంది. ఈ నేపథ్యంలోనే సాంకేతిక ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు వేం నరేందర్‌రెడ్డి తన సలహాదారు పదవిని స్వచ్ఛందంగా వదులుకున్నారు. ఆయన రాజీనామాను సీఎస్ రామకృష్ణా రావు వెనువెంటనే ఆమోదించారు.

**16 మంది ప్రయత్నించినా..**

రాష్ట్రం నుంచి ఖాళీ అయిన రెండు రాజ్యసభ స్థానాల భర్తీ కోసం కాంగ్రెస్ పార్టీ సుదీర్ఘ కసరత్తు చేసింది. భారీ సంఖ్యలో ఆశావహులు రంగంలోకి దిగడంతో వారి వివరాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేసిన పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ఏఐసీసీకి నివేదించారు. ఆశావహుల రాజకీయ ప్రస్థానం, పార్టీ పట్ల విధేయత చేసిన సేవలు, సామాజిక సమీకరణ తదితర అంశాలను అధిష్ఠానానికి ఇచ్చిన నివేదికలో పొందుపరచినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మొత్తం 16 మంది వివిధ సామాజిక వర్గాలకు చెందిన నాయకులు రాజ్యసభ స్థానాల కోసం ప్రయత్నించారు. రెడ్డి, బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన సీనియర్ నేతలు తమ వంతు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. సీనియర్ నాయకుడు వి.హనుమంతు రావు, మాజీ మంత్రి చిన్నారెడ్డి వంటి నేతలు నేరుగా అధిష్ఠానాన్ని కలిసి తమకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అయితే చివరికి అధిష్ఠానం నిర్ణయంలో రెండు ప్రధాన ప్రమాణాలు ప్రాధాన్యతలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. జాతీయ, రాష్ట్ర అవసరాలను దృష్టిలో ఉంచుకుని అధిష్టానం నిర్ణయం తీసుకుంది.

**నాడు వైఎస్ కేవీపీ జోడీలా**

నాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తనకు ఆత్మలా ఉన్న కేవీపీ రామచంద్రరావుకు రాజ్యసభ ఇప్పించుకున్నారు. అంత సమయం తీసుకోకుండానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనకుఅత్యంత ఆత్మీయుడిగా ఉన్న వేం నరేందర్ రెడ్డికి రాజ్యసభ ఇప్పించుకున్నారు. ఇద్దరికీ ఒకే తరహా బంధం, ఒకే తరహా పదవులు రావడంతో కాంగ్రెస్ కార్యకర్తలు అంతటా ఇదే చర్చ చేస్తున్నారు.



# కుటుంబ నియంత్రణ వద్దు

**అమరావతి, మహా :** ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గుడ్ న్యూస్ చెప్పారు. ఇకపై ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లల్ని కంటే కాన్పు సమయంలో రూ.25వేలు ఇస్తామని గురువారం నాడు అసెంబ్లీ సాక్షిగా కీలక ప్రకటన చేశారు. ప్రతి కుటుంబంలోని కుటుంబసభ్యుల సంఖ్య పెరిగే కొద్దీ వారికి ప్రోత్సాహకాలు ఉంటాయని చంద్రబాబు వెల్లడించారు. ఇప్పటివరకూ కుటుంబ నియంత్రణకు ప్రాధాన్యత ఇచ్చామని, ఇప్పుడు పాపులేషన్ మేనేజ్ మెంట్ గురించి చర్చిస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. పాపులేషన్ మేనేజ్ మెంట్ పాలసీ అమలు చేసిన మొదటి రాష్ట్రంగా ఏపీ నిలుస్తుందని తెలిపారు.

## బీహార్ పాలిటిక్స్‌లో
# నూతన శకం

(మొదటిపేజీ తరువాయి)

సీఎం పీఠం మాత్రం తనకే దక్కేలా చూసుకున్నారు. గత రెండు శాసన సభల్లోనూ భిన్న పార్టీలతో పొత్తుతో పోటీచేసిన నితీష్ బలం ఒకసారి ఆర్జేడీకన్నా తక్కువగా వున్నా, ప్రస్తుతం బీజేపీ కన్నా తక్కువగా వున్నా సీఎం పదవి మాత్రం తనదే అనిపించుకున్నారు.

**ఎట్టకేలకు బీజేపీకి బీహార్ సీఎం పదవి ..**

243 స్థానాలున్న ప్రస్తుత అసెంబ్లీలో ఎన్డీయే కూటమికి 202 స్థానాలుండగా అందులో మెజారిటీ (89) బీజేపీనే దక్కించుకోగా నితీష్ పార్టీ జేడీయూ 85 స్థానాలే దక్కించుకుంది. ఐనప్పటికీ ఎలాంటి అభ్యంతరం లేకుండా ముఖ్యమంత్రిగా నితీష్‌నే అంగీకరించింది బీజేపీ. నితీష్ సీనియారిటీ, పాలనపై ఆయనకున్న పట్టు ఆయనకు కలిసొచ్చాయి. ఇప్పుడు ఎట్టకేలకు నితీష్ రాజ్యసభకు వెళ్తుండటంతో ఆయనకు కేంద్ర మంత్రి పదవి ఖచ్చితంగా ఇస్తారన్న అంచనాలున్నాయి. మరి బీహార్ కి సీఎంగా ఎవరొస్తారు అనే ఆసక్తి సర్వత్రా నెలకొంది. నితీష్ తప్ప ఆయన పార్టీలో మరో నేత పేరు సీఎం పదవికి వినిపించట్లేదు. ఇటీవలే రాజకీయాల్లోకి వచ్చిన నితీష్ కుమారుడు నిషాంత్ కి మంత్రి వర్గంలో చోటివ్వొచ్చన్న చర్చ జరుగుతోంది.

**సీఎంల రేసులో పలువురు**

బీహార్ ముఖ్యమంత్రిగా నితీష్ శకం ముగుస్తుండగా ఇప్పుడు ఆయన స్థానంలో బీజేపీ నేత బీహార్ సీఎంగా నియమితులయ్యే అవకాశం ఉంది. బీహార్‌లో బీజేపీ ముఖ్యమంత్రి ప్రమాణస్వీకార చేయడం ఇదే మొదటి సారి అవుతుంది. ప్రస్తుత ప్రభుత్వంలో నితీష్ కుమార్ రికార్డు స్థాయిలో పదవసారి ప్రమాణ స్వీకారం చేయగా.. సామ్రాట్ చౌదరి మరియు విజయ్ కుమార్ సిన్హా వరుసగా రెండవసారి ఉప ముఖ్యమంత్రులుగా ఉన్నారు. బీహార్ రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి, కేంద్ర మంత్రి నిత్యానంద్ రాయ్ లేదా బీహార్ మంత్రి దిలీప్ కుమార్ జైస్వాల్ ముఖ్యమంత్రి రేసులో వున్నారు.సామ్రాట్ చౌదరి సీనియర్ బిజెపి నాయకులలో ఒకరు. ఆయన బీహార్‌లో హోం శాఖ, పంచాయతీరాజ్ మంత్రిగా పనిచేయడంతో పాటు రెండవసారి ఉప ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. నిత్యానంద్ రాయ్, ప్రస్తుతం హోం కేంద్రంలో వ్యవహారాల సహాయ మంత్రిగా పనిచేస్తున్నారు. అంకుముందు బీహార్‌కు బిజెపి అధ్యక్షుడిగా, హాజీపూర్ నుండి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవం ఆయనకు కలిసొచ్చే అవకాశం కనిపిస్తోంది. దిలీప్ కుమార్ జైస్వాల్ మూడుసార్లు శాసనమండలి సభ్యుడుగా అనుబవం తో పాటు రాష్ట్ర బిజెపి చీఫ్‌గా కూడా పనిచేశారు. దిఘా ఎమ్మెల్యే సంజీవ్ చౌరాసియా పేరు కూడా వినిపిస్తోంది. అయితే అనూహ్యంగా కొత్త ముఖాలను తెరపైకి తీసుకువచ్చే సంప్రదాయమున్నబీజేపీలో ఈసారి ఏమైనా జరగొచ్చనన్న గుసగులూ వినిపిస్తున్నాయి. ప్రస్తుత గుజరాత్, రాజస్థాన్, ఛత్తీస్ ఘడ్ సీఎంల తెరపైకి వచ్చిన ఉదంతాలు ఉదాహరణగా కూడా చెప్పుకుంటున్నారు.

# మమతకు షాక్

- మీ గవర్నర్ ను మార్చేశామని అమిత్ షా ఫోన్
- బెంగాల్ గవర్నర్ గా మరో కాంట్రవర్సీ కింగ్

**కోల్ కత, మహా :** తనను సంప్రదించకుండానే రాష్ట్ర గవర్నర్‌ను కేంద్ర ప్రభుత్వం మార్చేసిందని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఫోన్ చేసి చెప్పే వరకు తనకు ఈవిషయమే తెలియదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకునే ఇలాంటి నిర్ణయాలు భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైనవని ఆమె మండిపడ్డారు. ఇలాంటి చర్యలు దేశ సమాఖ్య వ్యవస్థ పునాదులపై జరిగే దాడుల లాంటివన్నారు. సహకార సమాఖ్య వ్యవస్థ సూత్రాలను గౌరవించాల్సిన బాధ్యత కేంద్ర సర్కారుపై ఉందని మమత చెప్పారు. ప్రజాస్వామిక సంప్రదాయాలు, రాష్ట్రాల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా ఉండే ఏకపక్ష నిర్ణయాలను తీసుకోవద్దని కేంద్ర ప్రభుత్వానికి ఆమె సూచించారు. ఈమేరకు బెంగాల్ సీఎం గురువారం ట్వీట్ చేశారు. రాష్ట్ర గవర్నర్ సీవీ ఆనంద బోస్ ఆకస్మిక రాజీనామా వార్తలు విని షాక్‌కు గురయ్యానని మమత తెలిపారు. సీవీ ఆనంద బోస్ స్థానంలో బెంగాల్ కొత్త గవర్నర్‌గా ఆర్ఎన్ రవిని నియమించిన విషయాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఇప్పుడే తనకు చెప్పారన్నారు. త్వరలో జరగనున్న బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనం కోసం కేంద్ర హోంమంత్రి ఒత్తిడి వల్లే ఆనంద బోస్ రాజీనామా చేసి ఉండొచ్చని ఆరోపించారు. కాగా ఆర్ ఎన్ రవి తమిళనాడులో స్టాలిన్ సర్కారుతో నిత్యకయ్యం పెట్టుకుని కాంట్రవర్సీగా మారగా, బోస్ కు మించి ఇతను మమతను ఇబ్బందిపెడతాడని నోటిఫికేషన్ కు ముందు గవర్నర్ ను మార్చారని రాజకీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# ప్రజాక్షేత్రంలోకి రేవంత్ సర్కార్

## నేటి నుండి 99 రోజులు ప్రజాపాలన.. ప్రగతి నివేదన

**హైదరాబాద్, మహా:** ప్రజాక్షేత్రంలోకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్ మరోసారి భారీప్రణాళికతో వెళ్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత ప్రజాక్షేత్రంలోకి ఇంకోసారి అడుగు పెడుతోంది. శుక్రవారం నుంచి జూన్ 12వ తేదీ వరకు 99 రోజులపాటు ప్రజాపాలన.. ప్రగతి నివేదన అనే అంశంపై వివిధ కార్యక్రమాలకు రూపకల్పన చేసింది. ఏప్రిల్ 16 తేదీన ఒకేరోజు అన్ని గ్రామాల్లో గ్రామ సభ లను, మే రెండో తేదీన నియోజకవర్గ స్థాయిలో ఒకేరోజు, మే 22 వ తేదీన జిల్లా స్థాయిలో సమావేశాలను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా పది అంశాలపై దృష్టి సారించనున్నారు. పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న ఫైళ్ళ క్లియరెన్స్, ఆరోగ్యం, సంక్షేమం, విద్య, అరైవ్ ఆలైవ్, పిల్లల భద్రత, డ్రగ్స్‌కు అడ్డుకట్ట వేయడం, రైతు సంక్షేమం, వ్యవసాయం, మహిళలు, యువత, క్రీడలు, పర్యావరణం, తదితర అంశాలపై ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2023 డిసెంబర్ 28వ తేదీ నుంచి జనవరి 6వ తేదీ వరకు ప్రజాపాలన గ్రామ, పట్టణ సభలను నిర్వహించి వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందేందుకు ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. అనంతరం సరిగ్గా రెండేళ్లు గడిచిన తర్వాత మరోసారి ప్రభుత్వం రెండేళ్ల పరిపాలన, అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు గురించి ప్రజల్లో ఎలాంటి అభిప్రాయాలు ఉన్నాయో తెలుసుకునేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమానికి ప్రణాళిక రూపొందించినట్లుగా తెలుస్తున్నది.

## భారత వైమానిక దళానికి చెందిన సుఖోయ్ యుద్ధ విమానం
# అదృశ్యం

**మహా:** భారత వాయుసేనలో కీలకమైన సుఖోయ్ (ఎస్ యూ 30ఎంకేఐ) యుద్ధ విమానం అదృశ్యమవడం కలకలం రేపింది. రాడార్‌తో సంబంధాలు తెగిపోవడంతో విమానం ఆచూకీ గల్లంతైంది. ఈ విషయాన్ని గుర్తించిన వెంటనే అప్రమత్తమైన అధికారులు, విమానం ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. విమానం రాడార్ పరిధి నుంచి హఠాత్తుగా మాయమైందని, పైలట్ల రక్షణ కోసం వెంటనే సెర్చ్ అండ్ రెస్క్యూ మిషన్‌ను ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై లెఫ్టినెంట్ కల్నల్ మహేంద్ర రావత్ స్పందించారు. విమానం రాడార్ కాంటాక్ట్ కోల్పోయిన మాట వాస్తవమేనని, ప్రస్తుతం సెర్చ్ ఆపరేషన్లు ముమ్మరంగా సాగుతున్నాయని ఆయన వెల్లడించారు.



## భర్త మృతిని తట్టుకోలేక
# భార్య మృతి

### 4 గంటల వ్యవధిలోనే దంపతుల కన్నుమూత

**జగిత్యాల, మహా:** జగిత్యాల జిల్లాలో హృదయాన్ని కలిచివేసే విషాద ఘటన చోటుచేసుకుంది. పెగడపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సురకంటి సత్తిరెడ్డి ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది. మద్దులపల్లి గ్రామానికి చెందిన ఆయన తల్లిదండ్రులు చుక్కరెడ్డి, శంకరవ్వ కేవలం 4 గంటల వ్యవధిలోనే కన్నుమూశారు. సమాచారం ప్రకారం... చుక్కరెడ్డి అనారోగ్యంతో బుధవారం సాయంత్రం సుమారు 6 గంటల ప్రాంతంలో మృతి చెందారు. ఈ విషాదాన్ని తట్టుకోలేక ఆయన భార్య శంకరవ్వ తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. భర్త మృతితో తీవ్రంగా కలత చెందిన ఆమె అదే రోజు రాత్రి సుమారు 11:30 గంటల సమయంలో కన్నుమూశారు.నాలుగు గంటల వ్యవధిలోనే దంపతులు ఇద్దరూ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు విషాదంలో మునిగిపోయారు. కుమారుడు సత్తిరెడ్డి నాలుగు రోజుల క్రితమే వ్యవసాయ విజ్ఞాన యాత్రకు వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో మద్దులపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## నిర్మాణంలో ఉన్న ఐదంతస్తుల భవనం కూలి
# ఇద్దరు కార్మికులు మృతి..

### మరో ముగ్గురికి తీవ్ర గాయాలు

**హైదరాబాద్, మహా :** టోలీచౌకీ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న భవనం కూలిపోవడంతో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యారు. ఇక ఈ ఘటనలో మరింత మంది కార్మికులకు కూడా తీవ్ర గాయాలు కావడంతో.. వారిని హుటాహుటిన దగ్గర్లో ఉన్న ఆస్పత్రికి తరలించి ట్రీట్‌మెంట్ ఇప్పిస్తున్నారు. టోలీచౌకీ అల్ హస్నాత్ కాలనీలో నిర్మాణంలో ఉన్న 5 అంతస్థుల భవనం కూలిపోవడంతో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. గాయపడిన వారిలో కొందరు కార్మికుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇక భవనం కూలిన ఘటనకు సంబంధించిన విషయం తెలిసిన వెంటనే పోలీసులు, సంబంధిత అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని హుటాహుటిన సహాయక చర్యలు మొదలుపెట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. దర్యాప్తు చేపట్టారు. కొత్త భవనానికి గోవా కర్రలు కట్టి.. వాటిపై నిలబడి కార్మికులు పనులు చేస్తుండగా.. అకస్మాత్తుగా ఆ కట్టెలు కూలిపోవడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మృతి చెందిన వారు శ్రీకాకుళం జిల్లాకు చెందిన తిరుపతి రావు, అది నారాయణగా గుర్తించారు. గాయపడిన వారు శ్రీకాకుళానికి చెందిన ఆర్.రమేష్, ఒడిశాకు చెందిన ఏం.రమేష్, బండ్లగుడాకు చెందిన లాల్ అహ్మద్‌గా గుర్తించారు. గాయపడ్డ వారిని లంగర్ హౌస్‌లోని ఆలివ్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. భవనం పక్కనే ఆటోలో ఉన్న వారిపై గొవా కర్రలు పడటంతో అందులో ఉన్నవారు కూడా గాయపడ్డట్లు సమాచారం. భవన నిర్మాణం కోసం కట్టిన గోవా కర్రలపై నిలబడి పనులు చేస్తుండగా ఒక్కసారిగా కర్రలు కూలడంతో ఈ ప్రమాదం జరిగింది.

# ఇరాన్‌పై అమెరికా దాడులు

### భారత నౌకలను అమెరికా వినియోగిస్తుందన్న వార్తలను ఖండించిన కేంద్రం

**ఇంటర్నెట్ డెస్క్:** మధ్యప్రాచ్యంలో కొన్ని రోజులుగా భీకర యుద్ధం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఇరాన్‌పై దాడుల కోసం అమెరికా నావికాదళం భారత నౌకలను ఉపయోగిస్తోందంటూ విస్తృతంగా జరుగుతున్న ప్రచారాలను కేంద్రం ఖండించింది. ఆ ఆరోపణలు పూర్తిగా అవాస్తవం, నిరాధారమని కేంద్ర విదేశాంగ శాఖస్పష్టం చేసింది. అమెరికా మాజీ ఆర్మీ కల్నల్ డగ్లస్ మాక్‌గ్రెగర్ ఇటీవల ఓ ఛానల్ ఇంటర్వ్యూ సందర్భంగా మాట్లాడుతూ.. 'గల్ఫ్ ప్రాంతంలో అమెరికా సైనిక స్థావరాలపై ఒత్తిడి పెరగడంతో మా నావల్ బేస్‌లు ధ్వంసమయ్యాయి. మా నౌకాశ్రయ సదుపాయాలూ ధ్వంసమయ్యాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో మేము భారత్, ఆ దేశానికి చెందిన నౌకాశ్రయాలపై ఆధారపడాల్సి వస్తోంది.

## ఐదురాష్ట్రాల ఎన్నికలకు ముందు..
# కేంద్రం సంచలనం

- పది రాష్ట్రాల గవర్నర్ల మార్పు
- తెలంగాణ నూతన గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా
- మహారాష్ట్రకు జిష్ణుదేవ్.. బెంగాల్ కు ఆర్ ఎన్ రవి
- తమిళనాడు, కేరళ, ఢిల్లీ సహా పలురాష్ట్రాలు ఛేంజ్

(మొదటిపేజీ తరువాయి)

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశంలోని పలు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమిస్తూ, మరి కొందరిని బదిలీ చేస్తూ గురువారం రాత్రి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు రాష్ట్రపతి భవనం అధికారిక ప్రకటన విడుదల చేసింది. కీలకంగా మారిన పశ్చిమ బెంగాల్ గవర్నర్ డాక్టర్ సి.వి. ఆనంద బోస్ రాజీనామాను రాష్ట్రపతి ఆమోదించారు. ఈ ఖాళీతో పాటు మరికొన్ని రాష్ట్రాల్లో పాలనా సౌలభ్యం పేరుతో మార్పులు చేర్పులు చేశారు. ఎన్నికలకు ముందు గవర్నర్ల మార్పు దేశరాజకీయాల్లో సంచలనంగా మారింది. ఓవైపు బీహార్ సీఎంను మార్చడంతో పాటు గవర్నర్ ను కూడా మార్చేసింది. బీహార్ సీఎం మార్పు ప్రక్రియను సజావుగా చేసేందుకు కేంద్రమంత్రి అమిత్ షా స్వయంగా బీహార్ వెళ్ళారు.


**తెలంగాణ నూతన గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా**

హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా ఉన్న శివ ప్రతాప్ శుక్లా తెలంగాణ నూతన గవర్నర్‌గా నియామకం అయ్యారు. ఇప్పటి వరకు తెలంగాణ గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహించిన జిష్ణు దేవ్ వర్మ మహారాష్ట్ర గవర్నర్‌గా బదిలీ అయ్యారు. తమిళనాడు గవర్నర్‌గా ఉన్న ఆర్.ఎన్. రవి పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ కు తమిళనాడు గవర్నర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు. రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ సయ్యద్ అతా హుస్సేన్ బీహార్ గవర్నర్‌గా నియమితులయ్యారు. తరంజిత్ సింగ్ సంధు ఢిల్లీ నూతన లెఫ్టినెంట్ గవర్నర్‌గా నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఢిల్లీ ఎల్జీగా ఉన్న వినయ్ కుమార్ సక్సేనా లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా బదిలీ అయ్యారు. లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఉన్న కవీందర్ గుప్తా హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా నియమితులయ్యారు. నంద్ కిషోర్ యాదవ్ నాగాలాండ్ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ నియామకాలన్నీ వారు బాధ్యతలు చేపట్టిన తేదీ నుంచి అమలులోకి వస్తాయని రాష్ట్రపతి కార్యాలయం తెలిపింది.

# ఔను..నిజమే

### షాకిచ్చిన విజయ్ - త్రిష

**మహా :** విజయ్ సినిమాలకు గుడ్ బై చెప్పి రాజకీయాల్లో తీరిక లేకుండా ఉండగా ఇటీవల భార్య సంగీత కోర్టుకెక్కడంతో విడాకుల విషయం బయటకు వచ్చింది. అధికార, ప్రతిపక్షాలు సైతం దీనిపై ఓ రేంజ్‌లో విమర్శలు, ట్రోలింగ్ చేస్తున్నాయి. ఆయనను ఫాలో అవుతున్న వారు సైతం ఏం చేయాలో దిక్కులేని పరిస్థితుల్లో చిక్కుకున్నారు. నటి త్రిష తో ఎఫైర్ ఉందనే ప్రచారం ఉంది. ఇలాంటి వార్తలు ప్రచారం జరుగుతుండగా, ఇవి నిజమే అన్నట్లు విజయ్, త్రిష గురువారం షాకిచ్చారు. ఓ వైపు ఈ వార్తలు ఇలా వస్తుండగానే చెన్నైలో ప్రముఖ నిర్మాత కళైపులి సురేశ్ కుమారుడి వివాహ రిసెప్షన్‌కు విజయ్ త్రిషతో కలిసి హాజరయ్యారు. ఇప్పుడు ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఇప్పటికే త్రిషతో సంబంధాల విషయంలో వ్యవహారం హాట్ టాపిక్‌గా ఉన్న సమయంలో ఇప్పుడు వీరిద్దరు కలిసి ఒక కారులో రిసెప్షన్‌కు రావడం సర్వత్రా చర్చనీయాంశం అవుతోంది. ప్రస్తుతం త్రిష, విజయ్‌ల నడుమ వస్తున్న వార్తలు నిజం అనడానికి ఈ వీడియోనే సాకక్ష్యమని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.





## అంగరంగవైభవంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
# తనయుడి వివాహం

### హాజరైన రాజకీయ, సినీ ప్రముఖులు

**మల్లిఖార్జున ఖర్గే, సీఎం రేవంత్, హేమంత్ సోరెన్, డికెశివకుమార్, చిరంజీవి సహా ప్రముఖుల హాజరు**

**హైదరాబాద్, మహా :** తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పెద్ద కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహ వేడుక శంషాబాద్‌లోని జీఎంఆర్ ఎరీనాలో గురువారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుకకు దేశ, రాష్ట్ర రాజకీయ ప్రముఖులు, సినీ రంగ దిగ్గజాలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్, మాజీ కేంద్ర ఆర్థిక మంత్రి పి. చిదంబరం, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఉత్తమ్ సహా రాష్ట్ర మంత్రులు, రాష్ట్ర ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పలు రాజకీయ పార్టీలకు చెందిన ప్రముఖ ముఖ్య నేతలున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీష్ రావు, గంగుల కమలాకర్, మల్లారెడ్డి, మాజీ ఎంపీ సంతోష్ కుమార్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిలు హజరయ్యారు. బీజేపీ నేతల్లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయలు హాజరయ్యారు.



# నేడు ఆదిలాబాద్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటన

- ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికపై జిల్లా కలెక్టర్లతో సమీక్ష
- ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ.. పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం

**ఆదిలాబాద్, మహా :** పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు నెరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా స్పెషలిస్ట్ క్యాంపును ఆయన ప్రారంభిస్తారు. అనంతరం 11 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించే సన్నాహక సమావేశంలో పాల్గొంటారు.

**వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సమీక్ష**

నిర్మల్, మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతో ఆయా జిల్లాల ఐడీఓసీల నుంచి ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి సమీక్ష నిర్వహిస్తారు. ఈ సందర్భంగా 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల యాక్షన్ ప్లాన్‌పై అధికారులకు ఆయన దిశానిర్దేశం చేయనున్నారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ ను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు.

**పర్యటన వివరాలు:**

మధ్యాహ్నం 1:55 గంటలకు: ఆదిలాబాద్ మహాలక్ష్మి వాడలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2:30 గంటలకు: సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో అదనపు డార్మిటరీ భవనాన్ని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 3:30 గంటలకు: బేల మండలం ధోప్తాల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమానికి హాజరవుతారు.

# ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమం విజయవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులతో సమీక్ష**



**కరీంనగర్ మహా:** ఈనెల 6 నుండి జూన్ 12 వరకు 99 రోజుల పాటు జిల్లాలో చేపట్టనున్న "ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన "ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక" కార్యక్రమ నిర్వహణకు జిల్లాలో నిర్వహించాల్సిన కార్యక్రమాలపై గురువారం కలెక్టరేట్ లో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఐదు దశల్లో 99 రోజులపాటు "ప్రజా పాలనప్రగతి ప్రణాళిక" కార్యక్రమ నిర్వహణకు వివిధ శాఖల అధికారులు సంసిద్ధం కావాలన్నారు. శాఖల వారీగా ప్రభుత్వం చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఏప్రిల్ 2న గ్రామస్థాయిలో గ్రామసభలు నిర్వహించాలని తెలిపారు. ఏప్రిల్ 16న మండల స్థాయి, మే 2న నియోజకవర్గ స్థాయి, మే 22న జిల్లాస్థాయిలో కార్యక్రమాలు ఉంటాయని అన్నారు. ఈ సభల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు చేకూరుస్తున్న లబ్ధి, వివిధ పథకాల గురించి వివరించాలని తెలిపారు. శాఖల వారీగా 10 వారాలపాటు అమలు చేసే ప్రత్యేక కార్యాచరణను పరిశీలించి పలు సూచనలు చేశారు. శాఖల వారీగా 10 రకాల అంశాలతో 99 రోజులపాటు జరిగే ఈ కార్యక్రమానికి ప్రణాళిక శాఖ నోడల్ గా వ్యవహరిస్తుందని తెలిపారు. గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ ఫైల్ క్లియరెన్స్, ఆరోగ్యం, అరైవ్అలైవ్, సంక్షేమం, పిల్లల భద్రత మత్తు పదార్థాల నిర్మూలన, రైతు సంక్షేమం వ్యవసాయం, విద్య, యువత క్రీడలు, మహిళలు పర్యావరణం అంశాల్లో నిర్వహించిన కార్యక్రమాలపై యాక్షన్ ప్లాన్ ను పరిశీలించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మి కిరణ్ నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, ముఖ్య ప్రణాళిక అధికారి రామ్ దత్తారెడ్డి, జడ్పీ సీఈవో శ్రీనివాస్ ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



### పదో తరగతి పరీక్షలలో విద్యార్థులు

# రికార్డు సృష్టించాలి..

- **563 మార్కుల రికార్డును తిరగరాయాలి**
- **పరీక్షలంటే భయం వద్దు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగండి**
- **తిప్పర్తి కేజీబీవీ విద్యార్థినులతో కలెక్టర్ ఆత్మీయ ముచ్చట్లు వారితోనే భోజనం**

**నల్గొండ మహా :** గత ఏడాది మన జిల్లా కేజీబీవీ విద్యార్థినులు పదో తరగతిలో 563 మార్కులతో అగ్రస్థానంలో నిలిచారు. ఈసారి ఆ రికార్డును దాటి మరిన్ని ఎక్కువ మార్కులు సాధించే వారు ఎంతమంది ఉన్నారు? అని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ విద్యార్థినులను ఉత్సాహపరిచారు. గురువారం ఆయన తిప్పర్తి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి గదిలోకి వెళ్లిన కలెక్టర్ విద్యార్థినులతో ముచ్చటించి వారి విద్యా ప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు.కలెక్టర్ అడిగిన ప్రశ్నకు పది మంది విద్యార్థినులు ఆత్మవిశ్వాసంతో చేతులెత్తి తాము అంతకంటే ఎక్కువ మార్కులు సాధిస్తామని బదులిచ్చారు. వారి ధైర్యాన్ని అభినందించిన కలెక్టర్ పలు అంశాలపై ప్రశ్నలు వేసి వారు చెబుతున్న సమాధానాలకు సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి లోనుకాకుండా భయం వీడి పరీక్షలు రాయాలని సూచించారు.

**వసతులపై ఆరా నేలపై కూర్చుని భోజనం.**

అనంతరం హాస్టల్ ప్రాంగణాన్ని కలియతిరిగిన కలెక్టర్ వసతులపై ఆరా తీశారు. దోమల ఇబ్బంది ఉందా? బెంచీలు సరిపోతున్నాయా? మరుగుదొడ్ల నిర్వహణ ఎలా ఉంది? అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని విద్యార్థులని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థినులతో కలిసి కలెక్టర్ నేలపై కూర్చుని భోజనం చేశారు. వంటల రుచిని స్వయంగా తనిఖీ చేస్తూ వారితో కలిసి ఆత్మీయంగా గడిపారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో జానయ్య, ఎంఈఓ నరసింహ నాయక్, ఏవో సన్నీ రాజు, ప్రిన్సిపాల్ కె. రాజరాజేశ్వరి, ఏఈ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

### రాజ్యసభ కాంగ్రెస్ అభ్యర్థులు సింఘ్వీ, నరేందర్ రెడ్డిలకు

# కవ్వంపల్లి అభినందనలు



**మహా:** తెలంగాణ నుంచి రాజ్యసభకు కాంగ్రెస్ అభ్యర్థులుగా ఖరారైన సిటింగ్ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీ, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డిని టీపీసీసీ ఎస్సీ సెల్ అధ్యక్షులు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వం సత్యనారాయణ మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. అంతే కాకుండా గురువారం వారు హైదరాబాదులో నామినేషన్లు దాఖలు చేయగా, ఈ కార్యక్రమంలోనూ రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రభృతులతో కలిసి డాక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

## ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమావేశం నేడు

**జిల్లా ఇన్చార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహా ఇతర మంత్రులు హాజరు**

**మహా:** కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు "ప్రజా పాలనప్రగతి ప్రణాళిక" కార్యక్రమం నిర్వహణపై సమీక్ష సమావేశం జరగనుంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లాకు చెందిన ఇతర మంత్రులు సమావేశంలో పాల్గొంటారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, వివిధ విభాగాల ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరు కానున్నారు.

# ఉగాది నాటికి 'ఇందిరమ్మ' ఇళ్లు పూర్తి కావాలి..


- **లబ్ధిదారులు గృహప్రవేశాలకు సిద్ధం కావాలి కలెక్టర్ చంద్రశేఖర్..**
- **తిప్పర్తి మండలం శిలార్మియా గూడెంలో ఇళ్ల పరిశీలన..**



**నల్గొండ మహా :** జిల్లాలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ఉగాది పండుగ నాటికి లబ్ధిదారులు గృహప్రవేశాలు చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన తిప్పర్తి మండలం శిలార్మియా గూడెం గ్రామంలో పర్యటించి అక్కడ నిర్మిస్తున్న ఇందిరమ్మ గృహాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ రాయి కరుణమ్మ అనే లబ్ధిదారురాలి ఇంటిని సందర్శించి నిర్మాణ పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఇంటి నిర్మాణానికి ఇప్పటి వరకు ఎంత ఖర్చయిందని ఆరా తీశారు. పేదలకు సొంత గృహ కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసం అందిస్తున్న రూ. 5 లక్షల ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పులు తెచ్చి ఇబ్బంది పడవద్దు అని ఆయన లబ్ధిదారులకు సూచించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసేలా హౌసింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

**చెత్త వేస్తే నోటీసులు ఇవ్వండి!**

గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వీధుల్లో మురుగు నిలవకుండా చెత్తాచెదారం పేరుకుపోకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రైవేట్ స్థలాల్లో చెత్త వేసే వ్యక్తులకు వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల పరిశుభ్రత కేవలం అధికారుల బాధ్యతే కాదని, ప్రజలు కూడా భాగస్వాములు కావాలని కోరారు. ఊరి పొలిమేరల్లో చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తరలించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో జానయ్య, హౌసింగ్ ఏఈ జ్యోతి, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



### ఆడబిడ్డ పెళ్లిలకు వివాహ కానుక అందజేసిన

# బీర్ల ఫౌండేషన్ చైర్ పర్సన్ బీర్ల అనిత...

**యాదాద్రి భువనగిరి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని బీర్ల నిలయంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సతీమణి, బీర్ల ఫౌండేషన్ చైర్‌పర్సన్ బీర్ల అనిత బీర్ల ఫౌండేషన్ సౌజన్యంతో పలువురు ఆడబిడ్డల పెళ్లిళ్లకు వివాహ కానుకలను అందజేశారు.ఆలేరు మండలం కొలనుపాక గ్రామానికి చెందిన గర్దాసు రమ్య - క్రాంతికుమార్ దంపతుల కూతురు వివాహానికి వివాహ కానుకను అందజేశారు.యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట గ్రామానికి చెందిన ఆలకుంట్ల లక్ష్మి - యాదగిరి దంపతుల కూతురు వివాహానికి వివాహ కానుకను అందజేశారు.మోటకొండూరు మండలం అమ్మనబోలు గ్రామానికి చెందిన వంగా లలిత - రమేష్ దంపతుల కూతురు వివాహానికి వివాహ కానుకను అందజేశారు.యాదగిరిగుట్ట పట్టణంలోని బీర్ల నిలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గారి సతీమణి, బీర్ల ఫౌండేషన్ చైర్ పర్సన్ బీర్ల అనిత బీర్ల ఫౌండేషన్ సౌజన్యంతో పలువురు ఆడబిడ్డల పెళ్లిళ్లకు వివాహ కానుకలను అందజేశారు.ఈ సందర్భంగా బీర్ల అనిత మాట్లాడుతూ, బీర్ల ఫౌండేషన్ ద్వారా అవసరమైన కుటుంబాలకు ఎల్లప్పుడూ సహాయం అందిస్తామని తెలిపారు.

## కన్న ఊరుల యాదాద్రి భువనగిరి జిల్లాను మర్చిపోను..

వీడ్కోలు సమావేశంలో పూర్వ కలెక్టర్ హనుమంతరావు

**యాదాద్రి భువనగిరి, మహా:** కన్న ఊరు లాగే యాదాద్రి భువనగిరి జిల్లాను మర్చిపోలేనని అధికారుల సహకారంతోనే జిల్లా సమగ్ర అభివృద్ధికి శక్తి యుక్తుల కృషి చేశానని గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్లో జరిగిన ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో పూర్వ కలెక్టర్ హనుమంతరావు అన్నారుఈ సమావేశంలోజిల్లాలోని అన్ని శాఖల అధికారులు ఆయనకు ఘన సన్మానం చేశారుజిల్లా కలెక్టర్ గా అభివృద్ధి చేసే గొప్ప అవకాశాన్ని యాదాద్రి భువనగిరి జిల్లా నాకు ఇచ్చిందనికన్న ఊరు లాగా ప్రజలంతా అక్కున చేర్చుకోవడం జీవితంలో మర్చిపోలేనని పూర్వ కలెక్టర్ హనుమంతరావు ఈ సందర్భంగా పేర్కొన్నారు. జిల్లా అధికారులు టీఎన్జీవో టీజీవో తాసిల్దారులు ఎంపీడీవోలు అధికారులందరూ పూర్వ కలెక్టర్ హనుమంతరావు ను ఘనంగా సత్కరించారు. ఒక సంవత్సరం నాలుగు నెలలపాటు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ గా పనిచేయడం గొప్ప అవకాశం అని పేర్కొన్నారు. జిల్లా అధికారులు ,కిందిస్థాయి సిబ్బంది సహకారంతో తన శాయశక్తుల సమగ్ర అభివృద్ధికి కృషి చేశామని పేర్కొన్నారు. ఇందులో అందరి సహకారం ఎల్లవేళలా మరువలేనని పేర్కొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా కన్న తల్లి లాగా అక్కున చేర్చుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి, ఆర్డీఓ లు కృష్ణా రెడ్డి, శేఖర్ రెడ్డి, జెడ్పీ సి.ఈ.ఓ శోభ రాణి, డి.ఆర్.ఓ జయమ్మ, తెలంగాణ గెజిటెడ్ అసోసియేటెడ్ ఉపేందర్ రెడ్డి, డి.ఆర్.డి.ఓ నాగి రెడ్డి, అన్ని విభాగాల జిల్లా అధికారులు, సిబ్బంది, టీఎన్జీవో టీజీవో సంఘాల ప్రతినిధులు ఎంపీడీవోలు తహసీల్దారులు , తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాల కోసం నిరంతరం శ్రమించాలి

**విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేసిన కలెక్టర్ అనురాగ్ జయంతి**



**ఆలేరు, మహా:** రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసిందని, విద్యార్థులు ఉన్నత లక్ష్యాల సాధన కోసం నిరంతరం శ్రమించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.గురువారం ఆలేరు మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల రెసిడెన్షియల్ స్కూల్ ని కలెక్టర్ సందర్శించారు. స్కూల్ లో ఎంతమంది విద్యార్థులు చదువు తున్నారని, ఇంటర్మీడియట్ లో ఎంత మంది విద్యార్థులు ఉన్నారని సంబంధిత ప్రిన్సిపాల్ ని అడిగి తెలుసుకున్నారు . ఉపాధ్యాయులు ఎంతమంది ఉన్నారని . అందరూ ఇక్కడే ఉంటారా లేక వెళ్లి వస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు.ఈ రోజు మెనూ ప్రకారం ఆహారం వండడం జరిగిందా అని పరిశీలించారు.. రోజు మెనూ ప్రకారం భోజనం రుచిగా పెడుతున్నార అని విద్యార్థులని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నన భోజనాన్ని కలెక్టర్ రుచి చూసి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.స్టోర్ రూమ్ లో ఉన్న బియ్యం, కూరగాయలు, వంట సరుకులను పరిశీలించారు.కూరగాయలు , గుడ్లు ఫ్రెష్ గా ఉన్నాయా లేవా అని పరిశీలించారు.ఆర్వో వాటర్ ఫిల్టర్ ను వాటర్ యొక్క క్వాలిటీని రెగ్యులర్ గా చెక్ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వెంకటమ్మ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సైబర్ నేరగాళ్ల 'మ్యూల్ అకౌంట్ల'పై పోలీసుల ఉక్కుపాదం




**కరీంనగర్ మహా :** తెలంగాణ రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ విభాగం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన *'ఆపరేషన్ క్రాక్‌డౌన్'*లో భాగంగా కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న వారిపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. కమీషన్లకు ఆశపడి తమ బ్యాంకు ఖాతాలను సైబర్ నేరగాళ్లకు అప్పగించిన మ్యూల్ అకౌంట్ దారులను కమిషనరేట్ వ్యాప్తంగా గుర్తించారు.

**ముఖ్య విషయాలు:**

మ్యూల్ అకౌంట్ల గుర్తింపు: కరీంనగర్ లోని నాలుగు ప్రధాన బ్యాంకుల్లో మొత్తం 34 మ్యూల్ ఖాతాలను పోలీసులు గుర్తించారు. ఇప్పటికే 162 వరకు NCRP పోర్టల్ ద్వారా ఫిర్యాదులు అందినట్లు, ఈ ఖాతాల ద్వారా సైబర్ నేరగాళ్లు దాదాపు 1000కి పైగా అక్రమ లావాదేవీలు జరిపినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఇప్పటివరకు ఈ వ్యవహారంలో 20 కేసులు నమోదు చేయగా, నిందితులపై కొత్త చట్టం సెక్షన్ 112 BNS ప్రకారం చర్యలు తీసుకోనున్నారు.

**నేరం జరిగే తీరు - సి.పి. హెచ్చరిక:**

ఈ సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ.. కొందరు వ్యక్తులు ఏజెంట్లు ఆశజూపే స్వల్ప కమీషన్లకు లోంగి, తమ వ్యక్తిగత బ్యాంకు ఖాతా వివరాలు, వాటికి లింక్ అయిన ఫోన్ నంబర్లను అపరిచితులకు అందజేస్తున్నారని తెలిపారు. సైబర్ నేరగాళ్లు బాధితుల నుండి దోచుకున్న సొమ్మును ఇతరుల ఖాతాల్లోకి (మ్యూల్ అకౌంట్లు) మళ్లించి, ఆపై తమ అవసరాలకు వాడుకుంటున్నారని వివరించారు."తెలియని వ్యక్తులకు మీ బ్యాంకు ఖాతాలను అద్దెకు ఇవ్వడం లేదా వివరాలు చెప్పడం నేరం. అలా చేసిన వారిని సైబర్ నేరగాళ్లకు సహకరించిన నేరస్థులుగానే పరిగణిస్తామని సీపీ తెలిపారు.

**ప్రజలకు సూచనలు:**

అపరిచితులకు మీ బ్యాంకు ఖాతా, ఏటీఎం కార్డు, లేదా ఓటిపి వివరాలు ఎట్టిపరిస్థితుల్లోనూ ఇవ్వకండి.నెలవారీ కమీషన్లు ఇస్తామంటూ మీ ఖాతాను వినియోగించుకుంటామని వచ్చే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండండి.మీ ఖాతాలో అనుమానాస్పద లావాదేవీలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించండి.బ్యాంకు అధికారుల సమన్వయంతో మ్యూల్ ఖాతాదారుల పూర్తి వివరాలు సేకరిస్తున్నామని, విచారణ వేగవంతం చేసి మిగిలిన నేరస్థులను కూడా త్వరలోనే పట్టుకుంటామని గురువారం కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాలునందు జరిపిన సమీక్షా సమావేశంలో సీపీ స్పష్టం చేశారు.

# దోమలు బాబోయ్.. దోమలు...!

## కందనులులో దోమల బెడద



**నాగర్ కర్నూల్ జిల్లా :** కందనులు నగరంలో ఎక్కడైన ఒక నిమిషం ఆగామంటే చాలు.... అతనిపై దోమలు దాడి చేయడం ఖాయం.ఆ వ్యక్తి దోమ కాటుకు గురికాక తప్పదు. అతను దోమల గుంపును చూసి పారిపోతుంటే కొంత దూరం వరకు అతని వెంట పడతాయి. ముఖ్యంగా సాయంకాలం దోమల బాధ చెప్పుకోలేనిది.సాయం సంధ్యవేళ అలా సరదాగా మిత్రులు...కుటుంబ సభ్యులు సరదగా పార్కుకు వెళ్ళినా. ట్యాంక్ బండ్ కు చేరుకున్నా దోమల దాడికి గురికాక తప్పదు. స్నేహితులు కలుసుకొని .... ఛాయ్ డబ్బాల వద్ద టీ తాగుదామనుకున్నా... దోమల బెడద విపరీతంగా ఉందని నగరవాసులు చెబుతున్నారు. పాలమూరు నగరమంతా ఇదే పరిస్థితి ఉందని అంటున్నారు.

**దోమల నివారణకు ఏం చేయాలి....**

నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ లో దోమల నివారణకు గతంలో ప్రత్యేకంగా లక్షల రూపాయాలు ఖర్చు చేసి ఫాగ్ యంత్రాలను కొనుగోలు చేశారు. ఎవరైన వార్డు సభ్యుడు ఫోన్ చేసి అడిగితే గాని ఫాగింగ్ యంత్రాలతో ఆ వార్డులో ఫాగింగ్ చేసేవారు. కాని గత రెండు సంవత్సరాలుగ నుంచి నగరంలో ఎక్కడా ఫాగింగ్ చేసిన దాఖలాలు లేవు.దాంతో విపరీతంగా దోమల సంతతి పెరిగింది.దీంతో నగరవాసులు దోమల నివారణకు ప్రత్యామ్నాయాలను వెతుక్కుంటున్నారు. తమకు హాని చేకురుతుందని తెలిసినా ప్రత్యేకంగా రసాయనాలతో తయారు చేసిన వాటిని వినియోగిస్తున్నామంటున్నారు. ఇద్దరు కలిసి మాట్లాడుకునే స్వేచ్ఛను కూడ దోమలు ఇవ్వడం లేదని కామెడీగా చెప్పుకుంటున్నారు. కంద నూలు మున్సిపాలిటీ కార్యాలయంలో మూలన ఉన్న యంత్రాలను బయటకు తేవాలని..నగరమంతా ఫాగింగ్ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**ఇళ్ళల్లో దోమల నివారణ ఏలా....**

నగరంలో మలేరియా.. డెంగీ కేసులు విపరీతంగా పెరిగినప్పుడు మాత్రమే వైద్య ఆరోగ్య శాఖ అలర్ట్ అవుతుంది. ఇళ్ళ పరిసరాల్లో దోమల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పిస్తుంది.నగరం రోగాల బారిన పడినప్పుడే ఆశ.. అంగన్ వాడి వర్కర్లతో దోమల నివారణకు ఇఃటింటి ప్రచారం చేపడుతుంది. ప్రతి ఇంటి ఆవరణలోని దోమలు నిల్వ ఉఃడే స్థలాల్లో దోమల మందును పిచికారి చేసేవారు. కాని ఈ మార్చి.. ఏప్రిల్ నెలల్లోనే దోమలు ఎక్కువగా ఉంటాయాట. ముందస్తుగానే నెలలో రెండు సార్లు దోమల మందు పిచికారి చేస్తే ప్రజలు రోగాల బారిన పడకుండా ఉంటారనేది నగరవాసుల సూచన. నెలకు ఓ సారి ప్రతి డివిజన్ లో ఫాగింగ్ చేయాలని నగరవాసులు కోరుతున్నారు.మరి కొత్త పాలకవర్గం దోమల నివారణకు నేటి నుంచే కార్యాచరణ చేపట్టాలని నగరవాసులు కోరుతున్నారు.ఇళ్ళల్లో.... ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా ప్రతి ఒక్కరు చూసుకోవాలి.దోమలతో తస్మాత్ జాగ్రత్త.



## డబుల్ బెడ్‌రూమ్ పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలి..

**నాగర్ కర్నూల్ జిల్లా :** నాగర్ కర్నూల్ మండల పరిధిలోని వనపట్ల, గన్యాగుల, పెద్ద ముద్దునూరు గ్రామాల్లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను గురువారం జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఇళ్ల వద్ద మిగిలి ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల పురోగతిని సమీక్షించిన కలెక్టర్, పెండింగ్ పనులన్నింటినీ వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించిన పెయింటింగ్, ఎలక్ట్రికల్, డ్రైనేజీ వంటి పనులను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులైన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.అలాగే పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ సూచించారు.జిల్లా కలెక్టర్ వెంట జిల్లా పిడి హౌసింగ్ సంగప్ప, నాగర్ కర్నూల్ ఎంపీడీవో, ఆయా గ్రామాల సర్పంచులు, తదితరులు ఉన్నారు.

# ప్రణాళికాబద్ధంగా ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక

- **నేడు జరగాల్సిన ఉమ్మడి జిల్లా సన్నాహక సమావేశం రేపటికి వాయిదా**
- **99 రోజుల పాటు క్షేత్రస్థాయిలో విస్తృత కార్యక్రమాలు..**
- **సమిష్టి కృషితో విజయవంతం చేయాలి కలెక్టర్ బి.చంద్రశేఖర్..**



**నల్గొండ టౌన్ మహా :** జిల్లాలో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. పరిపాలన పరమైన కారణాల దృష్ట్యా ఈనెల 6న జరగాల్సిన ఉమ్మడి నల్గొండ జిల్లా సన్నాహక సమావేశం ఈనెల 7కు వాయిదా పడిందని ఆయన తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు నల్గొండలోని ఉదయాదిత్య భవన్లో ఈ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ నుంచి ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్చి 6 నుండి జూన్ 12 వరకు 99 రోజుల పాటు జరిగే ఈ కార్యాచరణలో ప్రతి అధికారి క్షేత్ర స్థాయిలో భాగస్వాములు కావాలని స్పష్టం చేశారు. కార్యక్రమ వివరాలను వెల్లడిస్తూ మార్చి 6 నుండి 15 వరకు పరిసరాల పరిశుభ్రత, ఫైళ్ల పరిష్కారం చేపట్టాలని, పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను గుర్తించి గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఏప్రిల్ 6 నుండి 11 వరకు ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా మహిళా శిశు ఆరోగ్యం గర్భిణీలకు వైద్య సేవలపై దృష్టి సారించాలన్నారు. రహదారి భద్రతపై ఏప్రిల్ 13 నుండి 18 వరకు అవగాహన కల్పించాలని ఏప్రిల్ 20 నుండి 26 వరకు సంక్షేమ పథకాల లబ్ధిని గ్రామసభల్లో వివరించాలని సూచించారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా ఏప్రిల్ 27 నుండి మే 2 వరకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు.వ్యవసాయ రంగానికి సంబంధించి మే 4 నుండి 10 వరకు రైతు భరోసా, బీమా, ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మే 11 నుండి 16 వరకు పాఠశాలల్లో మౌలిక వసతులు, అక్షరాస్యతపై దృష్టి పెట్టాలని, మే 18 నుండి 23 వరకు క్రీడా ప్రాంగణాల శుభ్రత, మారథాన్లు నిర్వహించాలని ఆదేశించారు. మే 25 నుండి 30 వరకు మహిళా సంక్షేమం, జూన్ 1 నుండి 12 వరకు పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటడం ఆక్రమణల తొలగింపు చేపట్టాలన్నారు. ఏప్రిల్ 2న గ్రామ స్థాయి నుంచి జూన్ 2న రాష్ట్ర స్థాయి వరకు వివిధ దశల్లో సమావేశాలు ఉంటాయని వెల్లడించారు. అధికారులు హాస్టళ్లను తనిఖీ చేసి ఫుడ్ పాయిజన్ జరగకుండా చూడాలని ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఉగాది నాటికి ఇందిరమ్మ గృహ ప్రవేశాలకు లబ్ధిదారులను సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు జే.శ్రీనివాస్, వై.అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



### యువతలో వృత్తి నైపుణ్యం

# పెంపొందించాలి...

**జిల్లా కలెక్టర్ అనురాగ జయంతి**


**ఆలేరు, మహా:** యువతలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు వీలుగా, సాంకేతిక నైపుణ్యం పెంపొందించుకున్నప్పుడే యువతకు మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.గురువారం ఆలేరు మండల కేంద్రంలోని అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు.ఏ టి సి లో గల వివిధ రకాల కోర్స్ ల గురించి ప్రిన్సిపాల్ ను అడిగి ఉన్నారు. కలెక్టర్ విద్యార్థులతో పాటు ట్రైనర్లతో శిక్షణ పద్ధతుల గురించి అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లడుతూ ఈ సెంటర్ లో ఎంతమంది విద్యార్థులు ఉన్నారని . అందరూ రెగ్యులర్ గా వస్తున్నారా అని ప్రిన్సిపాల్ ని అడిగి తెలుసుకున్నారు., ఇక్కడ ట్రైనింగ్ పూర్తి చేసిన తర్వాత విద్యార్థులకి ఇంటర్న్షిప్ కల్పిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు.సెంటర్ లో ఉన్న మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్,ఆటోమేషన్ ,ఇండస్ట్రియల్ రోబోటిక్స్, డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్, అడ్వాన్స్డ్ సి ఎన్ సి మిషనింగ్ టెక్నీషియన్,వంటి కోర్సులు పై విద్యార్థులకి ఇస్తున్న శిక్షణ ని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆలేరు ఐ టి ఐ ని పరిశీలించారు. ఇక్కడ ఏం కోర్సులు నేర్పిస్తున్నారు అని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక నైపుణ్యం కలిగి ఉండి, సరికొత్త ఆలోచనలతో సృజనాత్మకతను చాటితే ఎంతో స్థాయికి చేరుకోవచ్చు అన్నారు.

### ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని

## తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



**ఆలేరు, మహా:** ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు .గురువారం ఆలేరు మండలం కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ లోఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం జరుగుతున్న పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.... విద్యార్థులు పరీక్షలు రాస్తున్న తీరును నిశితంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలన్నారు . పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. హాజరు వివరాలు,సీసీ కెమెరా పని తీరు, త్రాగు నీరు, వైద్య సదుపాయంల గురించి అడిగి తెలుసు కున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లపై కూడా ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసేలా చూడాలన్నారు. మాల్ ప్రాక్టీస్ కి ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జవాబు పత్రాల రవాణాకు పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్షలు పూర్తయ్యేంతవరకు విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది ,తదితరులు పాల్గొన్నారు.



## నూతన కలెక్టర్ ను సన్మానించిన మున్సిపల్ చైర్మన్ దంపతులు

**ఆలేరు, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో ఇంటర్ పరీక్షల కేంద్రంకు గురువారం ఆకస్మిక తనిఖీ చేయడానికి వచ్చిన జిల్లా నూతన కలెక్టర్ అనురాగ్ జయంతిని మర్యాద పూర్వకంగా ఆలేరు మున్సిపల్ చైర్మన్ భీజన బాలమణి భాస్కర్ దంపతులు కలిసిశాలువాతో సత్కరించారు...కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్ రెడ్డి, తహశీల్దారు ఆంజనేయులు ఎంపిడిఓ సత్యాంజనేయ ప్రసాద్ లు వున్నారు.

# సంజూ ఇన్నింగ్స్, ప్రతి ఒక్కరికీ ఒక సందేశం

క్రికెట్‌లో కొన్ని ఇన్నింగ్స్‌లు చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తాయి. కానీ సంకల్పంతో, సహనంతో, విమర్శల వర్షాన్ని తట్టుకుని ఆడిన ఇన్నింగ్స్‌లు మాత్రం అరుదు. టి20 ప్రపంచ కప్ వేదికగా వెస్టిండీస్‌పై సంజూ శాంసన్ ఆడిన 97 పరుగుల ఇన్నింగ్స్ అలాంటిదే.సెమీఫైనల్ ఆశలు సజీవంగా నిలబెట్టుకోవాల్సిన 'చావో రేవో' మ్యాచ్‌లో తన బ్యాట్‌ను మాటగా మార్చుకొని ఆడిన తీరు ప్రశంసనీయం.ఆ రోజు అతను శతకం నమోదు చేయకున్నా సహనం ఉన్న చోటే నిజమైన గెలుపు పుడుతుందని నానుడి నిజం చేస్తూ తన బ్యాట్‌ను మాటగా మార్చుకున్న తీరు ప్రత్యేకం.

వెస్టిండీస్‌పై సంజు ఇన్నింగ్స్ చూస్తే..."ఎవడన్నా కోపంగా కొడతాడు, లేకపోతే బలం గా కొడతాడు.. వీడేంటిరా చాలా శ్రద్ధగా కొట్టాడు..ఏదో ఒక గోడ కడుతున్నట్టు ...గులాబీ మొక్కకు అంటు కడుతునట్టు చాలా జాగ్రత్తగా.. పద్ధతిగా కొట్టాడు..." అతడు సినిమాలో డైలాగ్ గుర్తుకు వస్తుంది.సంజు చేసింది 97 పరుగులే కానీ 150 కోట్ల భారతీయుల హృదయాలను గెలిచాడు. ఆ ఇన్నింగ్స్‌లో ఆవేశం కన్నా అవగాహన ఎక్కువగా కనిపించింది. దూకుడు కన్నా బాధ్యత ముందుంది.తనదైన ఎటాకింగ్ గేమ్ సమయస్ఫూర్తి ఇవన్నీ అతని సన్నద్ధతకు నిదర్శనం.


అసలు టి20 ఫార్మాట్ స్వభావం వేగం. కానీ ఆ వేగంలో స్థిరత్వం చూపించడం అసలైన నైపుణ్యం. సంజు అదే చేశాడు. మొదట కొన్ని ఓవర్లలో పరిస్థితిని అర్థం చేసుకున్నాడు. ఓ ఎండ్ లో వికెట్లు పడుతున్నా క్రీజులో కుదురుకున్నాక చెత్త బంతులను బాదుతూ జట్టును విజయతీరాలకు చేర్చాడు. సెమీఫైనల్ ఆశలు నిలబెట్టుకోవాల్సిన 'చావో రేవో' పోరులో అతను ఒత్తిడిని జయించాడు. ఇలాంటి సందర్భాల్లో పరుగులు మాత్రమే కాదు, ఆత్మస్థైర్యమే అసలు కొలమానం. ప్రతి ఆటగాడి విజయవంతమైన ఇన్నింగ్స్ వెనుక కనిపించని కృషి ఉంటుంది. ఎవరూ చూడని నెట్ ప్రాక్టీస్, శ్రమ, ఎవరూ గుర్తించని సహనం ఇవే విజయానికి పునాది. ఆ కృషి ఒక్కరోజులో సాధ్యం కాదు. కానీ సరైన సమయంలో చరిత్రగా నిలుస్తుంది.

వెస్టిండీస్ పై బౌండరీ తో మ్యాచ్ ముగించాక హెల్మెట్ పక్కన పడేసి మోకాళ్లపై కూర్చుని ప్రాధేయ పడుతూ దేవుడిని స్మరిస్తున్న క్షణం అతనిలోని వేదన ప్రతి ఒక్కరినీ ఆలోచింప జేస్తుంది. అతను బెంచ్‌లో కూర్చుని ఎన్నిసార్లు బాధపడ్డాడో మనకు తెలియదు. రాత్రుళ్లు ఎంతగా కుమిలిపోయాడో మనం ఊహించలేం. జట్టు ఎంపికల్లో చోటు దక్కకపోయిన సందర్భాలు, వరుస అవకాశాల కోసం ఎదురుచూసిన రోజులు ఇవన్నీ ఒక ఆటగాడి మనోబలాన్ని పరీక్షిస్తాయి. అలాంటి వేళల్లో చాలామంది వెనక్కి తగ్గుతారు. కొందరు మాత్రం నిశ్శబ్దంగా తమను తాము మళ్లీ పునర్నిర్మించుకుంటారు. సంజు ఆ రెండో వర్గానికి చెందినవాడని ఈ ఇన్నింగ్స్ స్పష్టంగా తెలిపింది.

"నీ పోటీ ప్రపంచంతో కాదు— నిన్నటి నీతో" అనే జీవన సూత్రాన్ని అతను తన బ్యాటింగ్‌తో మరోసారి గుర్తు చేశాడు. నిన్నటి తప్పిదాలపై ఆలోచిస్తూ కుంగిపోవడం సులభం. కానీ వాటినే పాఠాలుగా మార్చుకొని ముందుకు సాగడం ధైర్యం. సంజు అదే చేశాడు.
సంజు కెరీర్‌ను వెనక్కి తిరిగి చూస్తే అది విరామాలతో నిండిన ప్రయాణం. అతని ప్రతిభపై ఎప్పుడూ సందేహం లేదు. స్ట్రోక్‌ప్లేలో సహజత్వం, టైమింగ్‌లో లయ, క్రీజ్‌లో ఆత్మవిశ్వాసం— ఇవన్నీ అతని సహజ లక్షణాలు. అయినా "స్థిరత్వం లోపిస్తోంది" అనే వ్యాఖ్యలు తరచూ వినిపించాయి.ఆటలో అత్యంత కఠినమైన పోరాటం ప్రత్యర్థితో కాదు మనసుతో. నువ్వు నీమీద నువ్వే సందేహపడే క్షణమే అసలు ఓటమి మొదలవుతుంది. సంజు ఆ దశను దాటాడు. వెనక్కి తగ్గలేదు. విమర్శలకు మాటలతో సమాధానం చెప్పలేదు. బ్యాట్‌తో సమాధానం ఇచ్చాడు.

అతని సంచలన ఇన్నింగ్స్ యువ క్రీడాకారులకు ఒక సందేశం లాంటిది. అవకాశాలు తరచూ రావు. కానీ వచ్చినప్పుడు వాటిని అందిపుచ్చుకునే సన్నద్ధత ఉండాలి. వైఫల్యాలు ఎగతాళి చేసినా, ప్రపంచం సందేహించినా, మన సామర్థ్యంపై నమ్మకం కోల్పోవద్దు. క్రీడలోనే కాదు, జీవితంలో కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది. ఉద్యోగంలోనైనా, చదువులోనైనా, ప్రజా జీవితంలోనైనా... సహనం, క్రమశిక్షణ, నిరంతర శ్రమే విజయానికి మార్గం. గెలుపు ఒక్కరోజులో రాదు. కానీ నిశ్శబ్దంగా సాగిన కృషి ఒకరోజు ఘనంగా ప్రపంచానికి చాటుతుందని సంజూ నిరూపించాడు.

ఇక ముందు సంజు బ్యాట్ నుంచి ఎన్నో శతకాలు జాలువారవచ్చు. రికార్డులు సృష్టించవచ్చు. కానీ ఈ 97 పరుగుల ఇన్నింగ్స్ అతని కెరీర్‌లో మలుపు తిప్పిన ఘట్టంగా చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఎందుకంటే అది కేవలం ఒక మ్యాచ్ విజయం కాదు కోట్లాది హృదయాలను గెలిచిన క్షణం.చివరగా చెప్పాల్సిన సందేశం ఒకటే..."ఓపికతో, నిజాయితీతో కష్టపడితే, ప్రపంచం ఎప్పటికైనా గుర్తిస్తుంది".



-అమరవాజీ నాగరాజు
టీపీసీసీ చీఫ్ పీఆర్ఓ





## ప్రోటీన్ ఎప్పుడు తినాలో తెలుసా?

### చెన్నై నిపుణురాలు చెప్పిన 3 ముఖ్యమైన సమయాలివే!

ఆరోగ్యంగా ఉండాలన్నా, కండరాలు దృఢంగా తయారవ్వాలన్నా ప్రోటీన్ (మాంసకృత్తులు) తప్పనిసరి. సాధారణంగా అందరూ 'రోజుకు ఎంత ప్రోటీన్ తీసుకోవాలి?' అనే అంశంపైనే దృష్టి పెడతారు. కానీ, నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ప్రోటీన్ 'ఎంత' తిన్నామన్న దానికంటే, 'ఎప్పుడు' తిన్నామన్నదే ముఖ్యం. సరైన సమయంలో ప్రోటీన్ తీసుకోకపోతే, మీరు పడే కష్టం వృథా అయ్యే అవకాశం ఉంది. ఈ విషయంలో చెన్నైలోని అపోలో స్పెక్ట్రా హాస్పిటల్స్‌కు చెందిన ప్రముఖ న్యూట్రిషనిస్ట్ మంజుల శ్రీధర్ కొన్ని కీలక సూచనలు చేశారు. ప్రోటీన్ తీసుకోవడంలో మనం చేసే పొరపాట్లు ఏంటి? ఆ మూడు ముఖ్యమైన సమయాలు ఏవో ఇప్పుడు చూద్దాం.

#### ప్రోటీన్ విషయంలో చేసే అతిపెద్ద పొరపాటు

చాలామంది ఉదయం పూట కేవలం కార్బోహైడ్రేట్లు (ఇడ్లీ, దోశ లేదా బ్రెడ్) తిని, మధ్యాహ్నమో లేదా రాత్రో భారీగా ప్రోటీన్ ఉండే ఆహారం తీసుకుంటారు. ఇది తప్పు అని మంజుల శ్రీధర్ హెచ్చరిస్తున్నారు. "మన శరీరంలో కొవ్వును నిల్వ చేసుకునే 'స్టోరేజ్ ట్యాంక్' ఉన్నట్టుగా, ప్రోటీన్‌ను నిల్వ చేసుకోవడానికి ఏ ట్యాంకూ ఉండదు. మన శరీరం ఒకేసారి కేవలం 20 నుంచి 40 గ్రాముల ప్రోటీన్‌ను మాత్రమే గ్రహించగలదు" అని ఆమె వివరించారు. ఉదాహరణకు, మీరు ఒకే పూట 70 గ్రాముల ప్రోటీన్ తింటే, శరీరం తనకి కావాల్సినంత వాడుకుని, మిగిలిన దాన్ని శక్తిగా మార్చి కాల్చేస్తుంది. దీనివల్ల కండరాల మరమ్మతుకు (Muscle Repair) అందాల్సిన ప్రోటీన్ అందక అవి బలహీనపడతాయి.

#### ప్రోటీన్ లెక్క ఎలా ఉండాలి?

మీరు తీసుకునే ప్రతి పూట భోజనంలో మీ శరీర బరువులోని ప్రతి కిలోకు 0.4 గ్రాముల ప్రోటీన్ ఉండేలా చూసుకోవాలి. అంటే, 80 కేజీల బరువున్న వ్యక్తి ఒక పూట భోజనంలో సుమారు 32 గ్రాముల ప్రోటీన్ తీసుకోవడం ఉత్తమం.

#### తప్పక గుర్తుంచుకోవాల్సిన 3 కీలక సమయాలు

ప్రోటీన్ తీసుకోవడానికి ఈ మూడు సమయాలు అత్యంత కీలకమైనవని నిపుణులు చెబుతున్నారు.

**బ్రేక్‌ఫాస్ట్ (ఉదయం అల్పాహారం):**
మనం నిద్రపోతున్నప్పుడు శరీరం శక్తి కోసం కండరాలను విచ్ఛిన్నం చేస్తుంది. ఉదయం పూట కనీసం 30 గ్రాముల ప్రోటీన్ తీసుకోవడం వల్ల ఆ విచ్ఛిన్న ప్రక్రియ ఆగి, కండరాల మరమ్మతు మొదలవుతుంది.

**వర్కవుట్ తర్వాత:**
వ్యాయామం చేసిన రెండు గంటల లోపు ప్రోటీన్ తీసుకోవాలి. ఈ సమయంలో కండరాలు పోషకాలను వేగంగా గ్రహిస్తాయి. జిమ్ నుంచి రాగానే ప్రోటీన్ షేక్ తాగకపోయినా, రెండు గంటల లోపు మంచి ప్రోటీన్ డైట్ తీసుకోవడం ముఖ్యం.

**నిద్రపోయే ముందు:**
మనం నిద్రిస్తున్నప్పుడే శరీరం కండరాలను ఎక్కువగా రిపేర్ చేస్తుంది. కాబట్టి పడుకునే ముందు గ్రీక్ యోగర్ట్ లేదా పనీర్ వంటి మెల్లగా జీర్ణమయ్యే ప్రోటీన్ తీసుకుంటే రాత్రంతా శరీరానికి కావాల్సిన ఇంధనం అందుతుంది.
"ఒకే పూట 160 గ్రాముల ప్రోటీన్ తినే వ్యక్తి కంటే, రోజంతా నాలుగు పూటలా కలిపి 120 గ్రాముల ప్రోటీన్ పంచే వ్యక్తిలో కండరాల పెరుగుదల మెరుగ్గా ఉంటుంది" అని మంజుల శ్రీధర్ ముగించారు.

#### తరచుగా అడిగే ప్రశ్నలు


**1. ప్రోటీన్ ఎందుకు రోజంతా సమానంగా తీసుకోవాలి?**
శరీరం ఒకేసారి ఎక్కువ ప్రోటీన్‌ను నిల్వ చేసుకోలేదు. అందుకే పూటకో కొంత చొప్పున తీసుకుంటే కండరాల పెరుగుదలకు (Muscle Protein Synthesis) నిరంతరం సహకారం అందుతుంది.

**2. వ్యాయామం చేయని వారు కూడా ఈ సమయాలను పాటించాలా?**
అవును. కండరాల క్షీణతను అరికట్టడానికి, రోజంతా ఉత్సాహంగా ఉండటానికి వ్యాయామం చేయని వారు కూడా ఉదయం, రాత్రి సమయాల్లో ప్రోటీన్ తీసుకోవడం మంచిది.

**3. ప్రోటీన్ అధికంగా ఉండే పదార్థాలు ఏవి?**
గుడ్లు, పప్పు ధాన్యాలు, చికెన్, పనీర్, సోయా, గ్రీక్ యోగర్ట్, మొలకలు ప్రోటీన్‌కు మంచి వనరులు

## 93 ఏళ్ల వయసులోనూ అదిరే కండలు..

### గిన్నిస్ రికార్డ్ బాడీబిల్డర్ ఫిట్‌నెస్ సీక్రెట్ ఇదే



ప్రపంచంలోనే అత్యంత వృద్ధ బాడీబిల్డర్‌గా గిన్నిస్ రికార్డు సృష్టించిన 93 ఏళ్ల జిమ్ ఆరింగ్టన్, తన ఫిట్‌నెస్ వెనుక ఉన్న అసలు రహస్యాలను వెల్లడించారు. వయసు పెరిగే కొద్దీ ఆహారపు అలవాట్లు, వర్కవుట్లలో ఆయన చేసుకున్న విప్లవాత్మక మార్పులు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సాధారణంగా 80 ఏళ్లు దాటాయంటే చాలు.. చాలామంది విశ్రాంతి తీసుకోవాలని భావిస్తారు. కదలడమే కష్టమనుకునే ఆ వయసులో, అమెరికాకు చెందిన జిమ్ ఆరింగ్టన్ మాత్రం ఇందుకు పూర్తి భిన్నం. కాలిఫోర్నియాకు చెందిన ఈ 93 ఏళ్ల 'ముత్తాత కేవలం యాక్టివ్‌గా ఉండటమే కాదు, ప్రొఫెషనల్ బాడీబిల్డింగ్‌లో గిన్నిస్ వరల్డ్ రికార్డును కూడా తన పేరిట లిఖించుకున్నారు. ఇప్పటికీ వారానికి మూడు సార్లు జిమ్‌లో చెమటోడుస్తూ యువతకు సవాల్ విసురుతున్నారు. అయితే, తన ఈ సుదీర్ఘ ఫిట్‌నెస్ ప్రయాణం వెనుక జిమ్ కష్టంతో పాటు ఒక తెలివైన 'డైట్ ప్లాన్' కూడా ఉంది.

**మాంసం, పాలకు స్వస్తి.. పుట్టగొడుగులే శక్తి**

దశాబ్దాల పాటు జిమ్ పాతకాలపు బాడీబిల్డింగ్ సూత్రాలనే పాటించారు. అంటే భారీగా బరువులు ఎత్తడం, కండరాల కోసం పాలు, మాంసం వంటి ప్రోటీన్ ఆహారాన్ని అధికంగా తీసుకోవడం. అయితే, 90 ఏళ్ల వయసులోకి అడుగుపెట్టాక తన శరీరంలో వస్తున్న మార్పులను ఆయన గమనించారు. వయసు పైబడటం వల్ల కండరాలు త్వరగా కోలుకోవడం లేదని (Recovery), కీళ్ల నొప్పులు (Inflammation) పెరుగుతున్నాయని గుర్తించారు. దీంతో ఆయన తన ఆహారపు అలవాట్లను పూర్తిగా మార్చేశారు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ షేర్ చేసిన ఒక వీడియోలో జిమ్ మాట్లాడుతూ.. "నేను పాత పద్ధతిలోనే పాలు, మాంసం ఎక్కువగా తీసుకునేవాడిని. కానీ అవి నా శరీరంలో మంటను, నొప్పులను కలిగిస్తున్నాయని అర్థమైంది. అందుకే నా డైట్‌ను పూర్తిగా మార్చేశాను. ఇప్పుడు నేను ఆలివ్ ఆయిల్, పుట్టగొడుగులు (Mushrooms) వంటి ఆహారానికే ప్రాధాన్యత ఇస్తున్నాను. దీనివల్ల నేను నొప్పి లేకుండా నిరంతరం వర్కవుట్ చేయగలుగుతున్నాను" అని వివరించారు.

**స్మార్ట్ వర్కవుట్: 10-10-10 ఫార్ములా**

జిమ్ కేవలం ఆహారంలోనే కాదు, వర్కవుట్ చేసే విధానంలోనూ మార్పులు చేసుకున్నారు. వారానికి మూడు రోజులు, ఒక్కో సెషన్‌లో రెండు గంటల పాటు ఆయన జిమ్‌లో గడుపుతారు. బరువులు ఎత్తడం కంటే కూడా, కండరాలపై ఒత్తిడి (Mechanical Tension) పెంచడంపైనే ఆయన దృష్టి పెడతారు.
**తాను పాటించే ప్రత్యేక పద్ధతిని '10-10-10' అని పిలుస్తారు.**
**మొదట 10 సార్లు వెయిట్స్ ఎత్తడం (Repetitions).**
ఆ తర్వాత 10 సెకన్ల పాటు ఆ బరువును అలాగే పట్టుకుని ఉంచడం (Isometric Squeeze).చివరిగా మరో 10 సార్లు వేగంగా రిపిటీషన్స్ చేయడం. ఈ పద్ధతి వల్ల కండరాల్లోని కణాలు ఉత్తేజితమై, వృద్ధాప్యంలోనూ కండరం దృఢంగా ఉంటుందని ఆయన నమ్ముతారు.

**మారుతున్న కాలంతో పాటే మనమూ..**

జిమ్ ఆరింగ్టన్ ప్రయాణం అందరికీ ఒక పాఠం. ఆయన పుట్టినప్పుడు చాలా బలహీనంగా, అనారోగ్య సమస్యలతో ఉండేవారట. కానీ తన బలహీనతను సాకుగా చూపకుండా, బాడీబిల్డింగ్‌ను కెరీర్‌గా ఎంచుకున్నారు. "బాడీబిల్డింగ్ అంటేనే పరిస్థితులకు అనుగుణంగా మారడం (Adaptation). జీవితంలో ఒక దశలో పని చేసిన పద్ధతి, మరో దశలో పని చేయక పోవచ్చు. మన శరీరం ఇచ్చే సంకేతాలను బట్టి మనం మారుతూ ఉండాలి" అని ఆయన సందేశమిస్తున్నారు. మొత్తానికి, క్రమశిక్షణతో కూడిన డైట్, శరీరాన్ని అర్థం చేసుకునే మనస్తత్వం ఉంటే 90 ఏళ్లలో కూడా 20 ఏళ్ల కుర్రాడిలా రాణించవచ్చని జిమ్ నిరూపిస్తున్నారు.

**తరచుగా అడిగే ప్రశ్నలు**

**1. ప్రపంచంలోనే అత్యంత వృద్ధ బాడీబిల్డర్ ఎవరు?**
కాలిఫోర్నియాకు చెందిన జిమ్ ఆరింగ్టన్ (93) ప్రపంచంలోనే అత్యంత వృద్ధ పోటీ బాడీబిల్డర్‌గా గిన్నిస్ వరల్డ్ రికార్డును కలిగి ఉన్నారు.

**2. జిమ్ ఆరింగ్టన్ తన డైట్‌లో ఎలాంటి మార్పులు చేశారు?**
జిమ్ తన పాతకాలపు డైట్ అయిన పాలు, మాంసం తీసుకోవడం మానేసి, వాటి స్థానంలో ఆలివ్ ఆయిల్, పుట్టగొడుగుల వంటి 'యాంటీ ఇన్‌ఫ్లమేటరీ' ఆహారాన్ని తీసుకుంటున్నారు.

**3. బాడీబిల్డింగ్‌లో జిమ్ అనుసరించే 10-10-10 పద్ధతి ఏమిటి?**
ఇది ఒక రకమైన వర్కవుట్ టెక్నిక్. ఇందులో 10 రిపిటీషన్స్ చేయడం, 10 సెకన్లు బరువును పట్టుకుని ఉండటం (Squeeze), తర్వాత మళ్ళీ 10 రిపిటీషన్స్ చేయడం జరుగుతుంది.

# ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక

### అధికారులతో కలెక్టర్ సమీక్ష




**ఆదిలాబాద్ మహా :** అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తున్నాదని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' పై మండల, జిల్లా స్థాయి అధికారులకు ఆయన ప్రత్యేక అవగాహన, సమీక్ష సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాల అమలు తీరును మెరుగుపరచడం దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని, పెండింగ్‌లో ఉన్న ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అన్నారు. ప్రజా పాలన దరఖాస్తుల క్రోడీకరణ, అర్హుల ఎంపికలో పారదర్శకతతో నిర్వహించాలన్నారు. విద్యా, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించాలనీ, మండల, జిల్లా స్థాయి అధికారులు నిరంతరం సమన్వయంతో పనిచేసి, అభివృద్ధి ఫలాలు ప్రతి పేదవాడికి అందేలా చూడాలన్నారు. సంక్షేమ పథకాల అమలులో ఎక్కడా అవినీతికి తావులేకుండా పూర్తి పారదర్శకత పాటించాలనీ, నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.అంతకుముందు జిల్లాలో జరిగిన అభివృద్ధి పనుల పురోగతిని విభాగాల వారీగా సమీక్షించారు. ఈ సమీక్షా సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆర్డీవో స్రవంతి, జెడ్పి సీఈవో రవీందర్, ఎంపీడీవోలు, తహాశీల్దార్లు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# చర్లపల్లి భూవివాదంపై హైడ్రా విచారణ

### కీలక ఆధారాల సమర్పణకు ఆదేశాలు



**కుషాయిగూడ, మహా :** కాప్రా సర్కిల్ పరిధిలోని చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు సమీపంలో ఉన్న సర్వే నంబర్ 186/4కు సంబంధించిన స్థలం విషయంలో వివాదం తీవ్రతరమవుతోంది. ఈసీ నగర్ హౌసింగ్ సొసైటీ ఫిర్యాదు మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా అధికార బృందం శుక్రవారం ఈసీ నగర్ ప్రాంతాన్ని సందర్శించి విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఇరుపక్షాల వాదనలు విన్న హైడ్రా అధికారులు, భూమికి సంబంధించిన అన్ని ఆధారాలు, పత్రాలను సమర్పించాలని ఆదేశించారు. స్థల యాజమాన్యం విషయంలో ఇరు వర్గాల మధ్య భిన్నాభిప్రాయాలు ఉండటంతో వివాదం మరింత ముదిరింది.ఈసీ నగర్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు మాట్లాడుతూ, ఈ స్థలాన్ని గతంలో గిఫ్ట్ డీడ్ ద్వారా జిహెచ్ఎంసికి అప్పగించామని తెలిపారు. అందువల్ల ఈ భూమి ప్రభుత్వానికి చెందినదేనని వారు స్పష్టం చేశారు. మరోవైపు వ్యక్తిగత యజమానులు మాట్లాడుతూ, ఈ భూమి తమ స్వంతమని పేర్కొన్నారు. గౌరవ హైకోర్టు ఆదేశాల మేరకు అధికారిక సర్వే నిర్వహించి, హద్దులు నిర్ణయించి తమకు అప్పగించారని తెలిపారు. దీనికి సంబంధించిన పత్రాలు తమ వద్ద ఉన్నాయని వెల్లడించారు.గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో భూముల ధరలు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, ఈ స్థలం విలువైనదిగా మారడంతో వివాదం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ కారణంగా ఇరు వర్గాల మధ్య తీవ్ర వాదోపవాదాలు కొనసాగుతున్నాయి. పరిస్థితిని సమీక్షించిన హైడ్రా అధికారులు, సమర్పించబోయే పత్రాలను పరిశీలించిన అనంతరం తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ నేపథ్యంలో, స్థల వివాదంపై స్పష్టత తీసుకురావాల్సిన బాధ్యత జిహెచ్ఎంసి అధికారులపై ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. సమగ్ర విచారణ జరిపి నిజానిజాలను వెలికి తీసి, ప్రజల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేయాలని వారు కోరుతున్నారు. అధికారిక నిర్ణయం వెలువడే వరకు కట్టడాలు నిర్వహించవద్దని ఆదేశాలు జారీ చేశారు. ఈ విచారణ కార్యక్రమంలో ఈసీ నగర్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు బూడిద శ్రవణ్ కుమార్ గౌడ్, ఉపాధ్యక్షురాలు సిహెచ్ పద్మిని, కోశాధికారి కాసుల ఇందిరాగౌడ్, సీనియర్ సిటిజన్ అధ్యక్షులు సత్తిరెడ్డి, ఈసీ నగర్ వెల్ఫేర్ అధ్యక్షులు ప్రసాద్, గోవర్ధన్, బాలయ్య గౌడ్ తదితరులు మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.



## నేడు జిల్లాలో మంత్రి జూపల్లి పర్యటన

- ఉదయం10 గంటల నుండి సాయంత్రం 5 వరకు పలు కార్యక్రమాలకు హాజరు
- ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక పై అధికారులతో సమీక్ష

**ఆదిలాబాద్ మహా :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా తెలంగాణా రాష్ట్ర టూరిజం ,ఎక్సైజ్ అండ్ ప్రోహిబిషన్, జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణా రావు శుక్రవారం ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు.ఉదయం రోడ్డు మార్గం ద్వారా పయనించి 10 గంటల వరకు నేరడిగొండ చేరుకుంటారు. అక్కడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక క్యాంపును ప్రారంభిస్తారు. ఉదయం 11గంటల వరకు ఆదిలాబాద్ చేరుకుని కలెక్టర్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు అధికారులతో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సమీక్షా సమావేశం అనంతరం ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ కాపీలను లబ్దిదారులకు అందిస్తారు. స్థానిక పెన్ గంగా అతిథి గృహం వద్ద కాసేపు విరామం తీసుకుని మధ్యాహ్నం 155కు మహాలక్ష్మి వాడ లో ఇందిరమ్మ గృహ ప్రవేశానికి హాజరవుతారు.మధ్యాహ్నం 230 కు పట్టణం సాంఘీక సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్ లో అదనపు డార్మెటరీ భవనాన్ని ప్రారంభిస్తారు. 330 కు బేల మండలం దోప్తాల గ్రామంలో ఇందిరమ్మ గృహ ప్రవేశానికి హాజరైన అనంతరం బేల మండల కేంద్రంలో పార్టీ కార్యక్రమానికి హాజరవుతారు.కార్యక్రమం అనంతరం అక్కడినుండి నేరుగా తిరిగి హైదరాబాద్ బయలుదేరి వెళతారు.

## సిసి కెమెరాల ఏర్పాటు ఒక ఉద్యమంలా సాగాలి- ఎస్పీ

### కమాండ్ కంట్రోల్ లో కెమెరాలను ప్రారంభించిన అఖిల్ మహాజన్



**ఆదిలాబాద్ మహా :** జిల్లా వ్యాప్తంగా సిసిటీవీ కెమెరాల ఏర్పాటు ఒక ఉద్యమంలో కొనసాగాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అందజేసిన 37 సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. ఒక కెమెరా 100 మంది పోలీసులతో సమానంగా విధులను నిర్వర్తిస్తుందని ఎస్పీ అన్నారు. 24 గంటలు పర్యవేక్షణతో దొంగతనాలను నేరాలను, ఘోరాలను అరికట్టవచ్చని, ఒకవేళ జరిగినా వాటిని ఛేదించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పట్టణంలో నూతనంగా ఎన్నికైన వార్డు కౌన్సిలర్లు తమ వార్డులలో కనీసం 10 కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా గ్రామాలలో ఎన్నికైన నూతన సర్పంచులు తమ గ్రామాలలో కెమెరాలను ఏర్పాటు చేసుకొని నేరాలను జరగకుండా అడ్డుకోవడానికి, ఒకవేళ జరిగిన నేరాలలో నిందితులను పట్టుకోవడంలో సహకరించడానికి సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. పట్టణంలో ప్రస్తుతం 250 కెమెరాలు పనిచేస్తున్నట్లు తెలిపారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో ముగ్గురు సిబ్బందితో 24 గంటలు పర్యవేక్షణతో కొనసాగుతుందని తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలను బస్టాండ్ , రైల్వే స్టేషన్ , మహాలక్ష్మి వాడ, రిమ్స్ ప్రాంగణాల లో ఏర్పాటుచేసినట్టు తెలిపారు. వ్యాపార సంస్థల సంఘాలు, ఇతర సంఘాలు సిసిటివి కెమెరాల ఏర్పాటుకు జిల్లా పోలీసులతో సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఉన్న మొత్తం సీసీటీవీ కెమెరాలను హైదరాబాద్లోని కమాండ్ కంట్రోల్స్ సెంటర్ కు అనుసంధానం చేసామన్నారు. సీసీటీవీ కెమెరాలు ప్రజల రక్షణ, భద్రత, బాధ్యతలను చేసే పోలీసులకు ఎంతగానో ఉపయోగపడతాయి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, పట్టణ సిఐలు బి సునీల్ కుమార్, కె నాగరాజు, ఐఎంఏ అధ్యక్షుడు వెంకటరెడ్డి, డాక్టర్లు, రిమ్స్ ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### పేదల సంక్షేమానికి

## కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది

### సింగిరెడ్డి వెంకట్ రెడ్డి

**కుషాయిగూడ, మహా :** వేసవి కాలంలో పేద ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకుంటూ, ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర నాయకుడు, బోగారం మాజీ ఎం.పీ.టి.సి సింగిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని పేద ప్రజలు రేషన్ కోసం తరచూ ఇబ్బందులు పడకుండా మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి అందించేలా నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ నిర్ణయం ద్వారా రాష్ట్రంలోని లక్షలాది పేద కుటుంబాలకు ఉపశమనం కలుగుతుందని చెప్పారు. పేదల సంక్షేమాన్ని ప్రధానంగా భావిస్తూ ఇలాంటి ప్రజాహిత కార్యక్రమాలను అమలు చేస్తున్న భారత ప్రధాని నరేంద్ర మోడీ మరియు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.

## ప్రజల సేవలో ఉండటమే నా లక్ష్యం!



**ఆమనగల్లు, మహా :** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని ఐదో వార్డు కాంటెస్టెడ్ అభ్యర్థి ఒగ్గు మహేశ్ పదవిలోలేకపోయినా నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు.గురువారం ఆయన మున్సిపల్ సిబ్బందితో కలిసి nరోడ్డు పక్కన ప్రయాణికులకు ఆటంకంగా ఉన్నబోరింగ్ను తొలగింపజేయడమే కాకుండా, వార్డులోని వీధి నల్లాలకు మరమ్మతులు చేయించారు. ఈ సేవా కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బందితో పాటు స్థానిక కాలనీవాసులు కూడాపాల్గొని ఆయన చొరవను అభినందించారు.

## టింబర్ డిపోలో భారీ అగ్ని ప్రమాదం

### కాలి బూడిదైన ప్లైవుడ్ కలప దుంగలు... కోటి రూపాయలు పైగా ఆస్తి నష్టం




**రాజేంద్రనగర్, మహా ;** మైలార్దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని కాటేదాన్ పారిశ్రామిక వాడలో సుమిత్ టింబర్ డిపో తో పాటు ఆనుకుని ఉన్న ప్లైవుడ్ గోదాంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటలు భారీగా ఎగిసిపడడంతో నష్టం భారీగా వాటిల్లింది. టింబర్ డిపోలో నిల్వ ఉంచిన కలప దుంగలకు మంటలు వ్యాపించడంతో దానిని ఆనుకొని ఉన్న బీ డీ ప్లైవుడ్ గోదాంలోకి మంటలు వ్యాపించాయి. దీంతో దట్టమైన నల్లని పొగ కమ్ముకోవడంతో పరిశ్రమల్లోని స్థానిక ప్రజలు భయాందోళనకు గురై పరుగులెత్తారు. దీంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులకు స్థానికులు సమాచారం చేరవేయడంతో అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైర్ ఇంజన్ల తో సంఘటన స్థలానికి చేరుకున్నారు. పక్క పక్కకు ఆనుకొని ఉన్న ఇతర పరిశ్రమలకు మంటలు వ్యాపించకుండా స్థానికులు కార్మికులు మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. అంతలోనే రెండు ఫైర్ ఇంజన్ సాయంతో మంటలను అదుపులోకి తెచ్చారు. అదృష్టం కొద్ది పరిశ్రమలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. గోదాంలో విలువైన కలప దుంగలు, ప్లైవుడ్ కాలి బూడిదయ్యింది. సుమారు కోటి వరకు ఆస్తి నష్టం జరిగి ఉండవచ్చని యజమానులు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా గోదాంలో అగ్ని ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తపరిచారు.



## మహిళా శక్తి చాటాలి

### బండారి అనూష

**ఆదిలాబాద్, మహా :** మహిళలు అన్ని రంగాల్లో సత్తా చాటాలని ధైర్యంతో ముందడుగు వేయాలని అదిలాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష అన్నారు. శుక్రవారం పట్టణంలోని వెటర్నరీ హాస్పిటల్ లో జరిగిన ఉమెన్స్ డే కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ప్రభుత్వం కూడా మహిళల ఎదుగుదల కోసం ప్రత్యేక రిజర్వేషన్లు ఏర్పాటు చేసిందన్నారు.అందుకే తాము ఎంచుకున్న రంగాలలో మహిళలు రాణించాలని ఆమె ఆకాంక్షించారు. అలాగే వైద్యులు తన దృష్టికి తెచ్చిన సమస్యల పరిష్కారానికి తాను శాయ శక్తులా కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక పై మున్సిపల్ సమీక్ష

### విజయవంతం చేయాలని అధికారులకు చైర్ పర్సన్ అనూష ఆదేశాలు



**ఆదిలాబాద్ మహా :** 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'ను విజయవంతం చేయాలని ఆదిలాబాద్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ బండారి అనూష పిలుపునిచ్చారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో కార్యక్రమం విజయవంతంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. శుక్రవారం నుండి వార్డుల సందర్శన ప్రారంభమవుతుందని, సమస్యలను గుర్తించి అక్కడికక్కడే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం, పెండింగ్ ఫైళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె సూచించారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమాన్నివిజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ రాజు, వైస్ చైర్మన్ మహ్మద్ రోహిత్, ఆర్వో కళ్యాణ్, మేనేజర్ స్వామి, వార్డు ఆఫీసర్లు ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## మైనార్టీల సంక్షేమమే లక్ష్యం

### సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సేవా నిరతి!

**ఆమనగల్లు, మహా :** పవిత్ర రంజాన్ మాసంసందర్భంగా ఐక్యత ఫౌండేషన్ ఛైర్మన్, టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కడ్తాల్, ఆమనగల్, మాడుగుల, తలకొండపల్లి, కల్వకుర్తి, వెల్దండ మండలాల్లోని సుమారు 3,600 ముస్లిం కుటుంబాలకు ఖర్జూర పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ శాంతి, ప్రేమలకు ప్రతీకని, మైనార్టీల సంక్షేమానికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ సభ్యులు మరియు స్థానిక ముస్లిం నాయకులు పాల్గొని రంజాన్ పండుగ ప్రాముఖ్యతను చాటి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల ఐక్యత ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు,రఘు,లింగం,గణేష్,యాదయ్య,విజయ్,శ్రీపతి,శేఖర్,నాగిళ్ళ శివ,సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



### బోగస్ ఓట్లపై ఈసి కు ఫిర్యాదు

**ఆమనగల్లు, మహా :** ఆమనగల్లు మున్సిపాలిటీ ఏడో వార్డులో బోగస్ ఓట్లపై గురువారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ కు వార్డు కాంగ్రెస్ కాంటెస్టెడ్ అభ్యర్థి కృష్ణ నాయక్ ఫిర్యాదు చేశారు. మున్సిపాలిటీ రికార్డులో లేని ఇంటి నంబర్ 14 182 ఇంట్లో 15 ఓట్లు ఉన్నాయని, వారు ఓటు వేయడంతో తన విజయావకాశాలపై తీవ్ర ప్రభావం పడిందని ఆయన అన్నారు. తనకు న్యాయం చేయాలనికమిషన్కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆదివాసీనాయకులు పాల్గొన్నారు.

### ఆమనగల్లు వీధుల్లో

## పారిశుద్ధ్య తనిఖీలు

**ఆమనగల్లు, మహా :** అమనగల్లు మున్సిపాలిటీ చైర్మన్ పత్య నాయక్ ఉదయం 6గంటలకే మున్సిపల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి పారిశుద్ధ్య సిబ్బంది హాజరును మరియు పనితీరును పరిశీలించారు. అనంతరం ఆయన 14వ వార్డు కౌన్సిలర్ వెంకటయ్యతో కలిసి స్వయంగా వీధుల్లో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. అమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు ప్రతిభా నగర్ కాలనీలో మురుగునీటి సమస్య పరిష్కారానికి అండర్ డ్రైనేజీ పనులను మున్సిపల్ చైర్మన్ పత్యా నాయక్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్, కౌన్సిలర్ ఎంగలి భాగ్యలక్ష్మి రఘు పాల్గొన్నారు.



## రాజస్థాన్ సమాజ్ వయోవృద్ధులకు సన్మానం

### ఆర్కేబీఎల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో...

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి పట్టణంలోని మహేశ్వరి భవన్ లో బుధవారం రాత్రి హోళీ పండుగను పురస్కరించుకుని ఆర్.కేబీఎల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రాజస్థానీ సమాజ్ కు చెందిన వయోవృద్ధులను సన్మానించారు. ఈ సందర్భంగా పూల హోళీ తో పాటు ఆట పాటల కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజస్థాన్ సమాజ్ కు చెందిన వయోవృద్ధులు కూడా ఎంతో ఆనందంగా పాల్గొన్నారు.నిర్వాహకులను పలువురు అభినందించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా 29 వ వార్డు కౌన్సిలర్ మేడి పున్నం చంద్రు, నాయకులు బీ.జీ.శంకర్ సింగ్,బండారి ప్రవీణ్, రాజస్థానీ సమాజ్ సభ్యులు పాల్గొన్నారు.

## పారిశుధ్య నిర్వహణ మనందరి బాధ్యత

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, మహా :** పారిశుధ్య నిర్వహణ మనందరి బాధ్యతని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నస్పూర్ ప్రాంతంలో గల 32వ డివిజన్ లో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్, మేయర్ ధర్ని మధుకర్ డిప్యూటీ మేయర్ చల్లా రమ్య లతో కలిసి మంచిర్యాల శుభ్రత ప్రతి ఒక్కరి ఆరోగ్య భద్రత కార్యక్రమాన్నిప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పారిశుద్ధ్యం ప్రతి ఒక్కరి బాధ్యత అని, పరిశుభ్రత పాటించడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమం కొరకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల నుండి నిధులు మంజూరు చేయడం జరిగిందని వెల్లడించారు. వచ్చే 99 రోజులలో కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసే విధంగా కార్యచరణ రూపొందించామని తెలిపారు. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలలో మాత్రమే కాకుండా అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో పారిశుద్ధ కార్యక్రమాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పారిశుద్ధ్య మాత్రమే కాకుండా ఏ కార్యాలయాలలో పెండింగ్ లో ఉన్న జనన, మరణ, భవన నిర్మాణ, ఇతర ధ్రువపత్రాలకు సంబంధించి ఫైళ్ళ క్లియరెన్స్ కొరకు చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. అధికారులు, సిబ్బంది ప్రజాప్రతినిధులను, ప్రజలను భాగస్వామ్యం చేసుకుంటూ పనులను పూర్తి చేయాలని సూచించారు. పారిశుధ్య సిబ్బంది ప్రతిరోజూ ప్రతి ఇంటింటి నుండి తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించి డంపింగ్ యార్డ్ కు తరలించాలని, ఉపయోగకరమైన చెత్తను వేరు చేసి సెగ్రిగేషన్ షెడ్ కు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గృహాలు, పరిశ్రమలు, మార్కెట్ ప్రాంతాలలో చెత్తను రోడ్లపై, మురుగు కాలువలలో వేసినట్లయితే చర్యలు తీసుకోవడం జరుగుతుందని, రోడ్లు, మురుగు కాలువలు శుభ్రం చేయడం, వీధి దీపాల మరమ్మత్తులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా శుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నట్లయితే కార్యక్రమం విజయవంతం అవుతుందని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో శుభ్రత కార్యక్రమాన్ని విజయవంతం చేసి అందరికీ ఆదర్శంగా నిలవాలని తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మధుకర్ మాట్లాడుతూ శుభ్రత కార్యక్రమంలో భాగంగా మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్ లలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. మున్సిపల్, విద్యుత్, త్రాగునీరు సంబంధిత శాఖల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముందు రోజు డివిజన్లో పర్యటించి నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మంచిర్యాల పట్టణంలోని ఫంక్షన్ హాల్ లు, హాస్పిటల్ లు, వ్యాపార సముదాయాలు, మద్యం దుకాణాల నిర్వాహకులు శుభ్రత విషయంలో నిబంధనలు పాటించాలని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

## ఇన్స్ ఫెర్ మానక్ అవార్డుకు మందమర్రి విద్యార్థి ఎంపిక

### టి.జి.ఎస్.డబ్ల్యూ.ఆర్.జె.సి – బి, మంచిర్యాల విద్యార్థి




**మంచిర్యాల, మహా :** ఇన్స్ ఫెర్ మానక్ అవార్డుకు మందమర్రి విద్యార్థి ఎంపిక ముప్పిడి రామ్ చరణ్ ఎంపికయ్యారు. విజ్ఞాన, సాంకేతిక రంగంలో విద్యార్థుల సృజనాత్మక ఆలోచనలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వ విజ్ఞాన సాంకేతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇన్స్పైర్ మానక్ అవార్డు 2025-26 కు టి.జి.ఎస్.డబ్ల్యూ.ఆర్.జె.సి - బి, మంచిర్యాల పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి ముప్పిడి రామ్ చరణ్ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. మందమర్రి పట్టణానికి చెందిన పాల వ్యాపారి మల్లేష్ - సరిత దంపతుల కుమారుడైన చరణ్, తన వినూత్న ఆలోచనతో ఈ ప్రతిష్టాత్మక పథకానికి ఎంపిక కావడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా పాఠశాల విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత, ఆవిష్కరణలను ప్రోత్సహించడం లక్ష్యంగా ఉంది. ఎంపికలో భాగంగా రామ్ చరణ్ సమర్పించిన వినూత్న ఆలోచన ఆధారంగా శాస్త్ర ప్రాజెక్ట్ మోడల్ రూపొందించేందుకు రూ.10,000 మొత్తాన్ని విద్యార్థి బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నారు.జాతీయ స్థాయి కార్యక్రమానికి తమ పాఠశాల విద్యార్థి ఎంపిక కావడం గర్వకారణమని పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఈ విజయం విద్యార్థుల్లో శాస్త్రీయ సృజనాత్మకతను పెంపొందించేందుకు పాఠశాల అందిస్తున్న ప్రోత్సాహాన్ని ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థికి గైడ్ టీచర్ కె. రాజేశ్వర్ (పీజీటీ ఫిజికల్ సైన్స్)ను పాఠశాల తరపున అభినందించారు.

# ప్రజా పాలన ప్రగతి పకడ్బందీగా అమలు చేయాలి

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, మహా :** ప్రజా పాలన ప్రగతి పకడ్బందీగా అమలు చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మంచిర్యాల జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య తో కలిసి వివిధ శాఖల జిల్లా అధికారులతో 99 రోజుల ప్రణాళిక గురించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడి సెంటర్ల లో పోషణ ప్రణాళిక అమలు, డ్రాప్ అవుట్ పిల్లలను తిరిగి తీసుకురావడం, సామ్, మామ్ పిల్లల గుర్తింపు, సఖి సంబంధిత అంశాలపై ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. జిల్లా వెనుకబడిన తరగతుల, షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్ తెగల, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు వారి ఆధ్వర్యంలోని సంక్షేమ వసతి గృహాలలో పారిశుద్ధ్యం, ఉపకార వేతనాలు, డైట్ చార్జీల పెంపుపై అవగాహన కల్పించడం, పిల్లల హాజరు శాతం పెంచడం, ఆయా శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న పథకాలపై అవగాహన కల్పించడం, లబ్ధిదారులను గుర్తించడం అంశాలపై కార్యచరణ చేయాలని స్పష్టం చేశారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నూతన సబ్ స్టేషన్ ల ఏర్పాటు, గృహ జ్యోతి పథకం అమలు, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రోగ్రెసివ్ ఫార్మర్స్ గుర్తింపు, సందర్శన, భూసార ఆరోగ్య కార్డు, పంట మార్పిడి, సోలార్ పంపుల ఏర్పాటు, రైతులతో శాస్త్రవేత్తల సమావేశం, పప్పుధాన్యాల పంటలను ప్రోత్సహించడం వంటి అంశాలపై ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శిశు మరణాల నియంత్రణ, ఆసుపత్రులలో ప్రసవాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, బస్తీ దవాఖానలు, పాఠశాలల సందర్శన, ప్రభుత్వ వైద్యశాలలు, నాణ్యత ప్రమాణాలు పెంపొందించడం, ప్రపంచ ఆరోగ్య దినోత్సవం, డ్రగ్ కంట్రోల్ రెగ్యులేటరీ, డిజిటల్ హెల్త్ కార్డ్స్ జారీ చేయడం, హెచ్ పి వి వ్యాక్సినేషన్ తదితర అంశాలపై దృష్టి సారించాలని వెల్లడించారు. జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం, జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం ఆధ్వర్యంలో పారిశుద్ధ్య నిర్వహణ, త్రాగునీరు, పన్నుల వసూలు, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, పల్లె ప్రకృతి వనాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాల నిర్వహణ, సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణ వంటి అంశాలు, గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కూలీల నిర్వహణ, మెటీరియల్ కాంపోనెంట్ వినియోగం, మూత్రశాలలు, కిచెన్ షెడ్ల నిర్మాణం, ప్లాంటేషన్ ప్రోగ్రాం, సామాజిక ఇంకుడు గుంతల నిర్వహణ, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పేరెంట్ టీచర్ సమన్వయ సమావేశం, అసంపూర్తిగా ఉన్న నిర్మాణాల పురోగతి, మండల స్థాయిలో సౌకర్యాల కల్పన తదితర అంశాలపై కార్యచరణ చేయాలని పేర్కొన్నారు. గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇండ్ల పనులు త్వరితగతిన పూర్తయ్యేలా ప్రణాళిక రూపొందించాలని, రవాణా శాఖ ఆధ్వర్యంలో కంటిచూపు పరీక్షలు నిర్వహణ, ఎక్కువ సంఖ్యలో వాహనాలు ఆగే ప్రదేశాలలో డ్రైవర్లకు అవగాహన కల్పించడం, డ్రంక్ అండ్ డ్రైవ్ పై కఠినంగా వ్యవహరించడం, రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవడం, జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో చేయబడిన నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ వివరాలు, గ్రామపంచాయతీ, మున్సిపల్ వార్డుల వారిగా వివారాలతో సిద్ధం చేయాలని తెలిపారు. జిల్లా అధికారులు తమ పరిధిలోని కార్యాలయంలో, కార్యాలయాల పరిసరాల లో పారిశుధ్యం నిర్వహణ, పెండింగ్ లో ఉన్న ఫైల్స్ క్లియర్ చేయడం వంటి వాటిని పూర్తి చేయాలని, అంతర్గత సమావేశాలు నిర్వహించి 99 రోజుల ప్రణాళిక తయారు చేసి, పక్కాగా అమలు అయ్యేలా సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హైస్పీడ్‌లో వాహన విక్రయాలు

## ఫిబ్రవరిలో 26 శాతం అప్..

## 24 లక్షలకు పైగా అమ్మకాలు.. ఫాడా వెల్లడి



**న్యూఢిల్లీ:** జీఎస్‌టీ క్రమబద్ధీకరణ నేపథ్యంలో వాహన విక్రయాల జోరు ఫిబ్రవరిలోనూ కొనసాగింది. గత నెల మొత్తం వాహనాల రిటైల్ విక్రయాలు 26 శాతం పెరిగి 24,09,362 యూనిట్లకు చేరినట్లు డీలర్ల సమాఖ్య ఫాడా ఒక ప్రకటనలో వెల్లడించింది. గతేడాది ఫిబ్రవరిలో 19,17,934 యూనిట్లు అమ్ముడైనట్లు పేర్కొంది. దాదాపు అన్ని విభాగాల్లోనూ అమ్మకాల జోరు కొనసాగినట్లు వివరించింది.ఆరింట అయిదు కేటగిరీల్లో (టూవీలర్లు, త్రీ-వీలర్లు, ప్యాసింజర్ వాహనాలు, కమర్షియల్ వాహనాలు, ట్రాక్ట ర్లు) ఫిబ్రవరిలో అత్యధికంగా రిటైల్ సేల్స్ నమోదైనట్లు ఫాడా ప్రెసిడెంట్ సీఎస్ విఘ్నేశ్వర్ తెలిపారు. మార్కెట్లో పటిష్టమైన డిమాండ్‌ని ఇది సూచిస్తోందని పేర్కొన్నారు. జీఎస్‌టీ క్రమబద్ధీకరణతో రేట్లు తగ్గడం, పెళ్లిళ్ల సీజన్, కొత్త మోడల్స్ రాకతో బుకింగ్స్ మెరుగ్గా ఉండటంలాంటివి పరిశ్రమకు సానుకూలంగా నిల్చినట్లు వివరించారు. పంట దిగుబడులు బాగుండి గ్రామీణ ప్రాంతాల్లో నగదు లభ్యత మెరుగుపడటం, ఆకర్షణీయమైన మార్కెటింగ్ స్కీములు కలిసి వచ్చినట్లు డీలర్లు చెప్పారు.

**ఇతర విశేషాలు..**

- టూవీలర్లు 25%, త్రిచక్ర వాహనాలు 24%, ప్యాసింజర్ వాహనాలు 26%, కమర్షియల్ వాహనాలు 29% అమ్మకాల వృద్ధిని నమోదు చేశాయి.
- ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు 3,13,015 యూనిట్ల నుంచి 3,94,768 యూనిట్లకు పెరిగాయి. పట్టణ ప్రాంతాల్లో 21 శాతం, గ్రామీణ మార్కెట్లలో 34 శాతం వృద్ధి నమోదైంది. స్పోర్ట్స్ యుటిలిటీ వాహనాలు, యుటిలిటీ వాహనాలే ఓవరాల్‌గా ఈ విభాగానికి దన్నుగా నిలుస్తున్నప్పటికీ, చిన్న కార్లకు గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ నెలకొనడం సానుకూలాంశం.
- టూవీలర్ విక్రయాలు 13,60,155 యూనిట్ల నుంచి 17,00,505 యూనిట్లకు పెరిగాయి.
- వాణిజ్య వాహనాల విభాగంలో అమ్మకాలు 78,219 యూనిట్ల నుంచి 1,00,820 యూనిట్లకు పెరిగాయి.
- త్రీ-వీలర్ సేల్స్ 1,17,130.. ట్రాక్టర్ల అమ్మకాలు 89,418 యూనిట్లుగా నమోదయ్యాయి.

# ఎగుమతులకు సర్‌చార్జీల మోత

## పశ్చిమాసియా ఉద్రిక్తతలతో షిప్పింగ్ లైన్స్ డిమాండ్‌లు.. రూ. 4,000 వరకు అదనపు భారం .. ఎగుమతిదారుల గగ్గోలు

**న్యూఢిల్లీ:** పశ్చిమాసియాలో యుద్ధంతో దేశీయంగా ఎగుమతిదారులకు షిప్పింగ్ సర్‌చార్‌జ్‌ల రూపంలో సవాళ్లు ఎదురవుతున్నాయి. ఉద్రిక్త పరిస్థితులను సాకుగా చూపి షిప్పింగ్ కంపెనీలు అదనంగా డిమాండ్ చేస్తున్నాయి. ఎక్కువకాలం నిల్వ ఉండని ఉత్పత్తులను మోసుకెళ్లే 40 అడుగుల కంటైనర్లపై అదనంగా రూ. 4,000 మేర కంటింజెన్సీ సర్‌చార్జీలు ఇవ్వాలంటున్నాయని ఎగుమతిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడి చేయడానికి ముందే కొన్ని కన్సైన్‌మెంట్లు గమ్యస్థానాలకు చేరినప్పటికీ, సరుకును రిలీజ్ చేయాలంటే అదనంగా చెల్లించాల్సిందేనని షిప్పింగ్ కంపెనీలు పట్టుబట్టి కూర్చున్నాయని వివరించారు. 'ఫిబ్రవరి 28న యుద్ధం మొదలు కావడానికి ముందే పశ్చిమాసియాలోని పోర్టులకు నౌకలు చేరుకున్నాయి. కానీ అధిక సర్‌చార్జీలు ఇవ్వాలంటూ, షిప్పింగ్ సంస్థలు డెలివరీ చేయడం లేదు. ఈ భారాన్ని ఎవరు భరించాలనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఈ సమస్యను కేంద్ర వాణిజ్య శాఖ దృష్టికి తీసుకెళ్లాం' అని ఎగుమతి సంస్థల సమాఖ్య ఎఫ్ఐఈవో డైరెక్టర్ జనరల్



అజయ్ సహాయ్ తెలిపారు. భారత్‌లో ఇంకా లోడ్ కాని వాటిపై చార్జీలు విధిస్తే అర్థం చేసుకోవచ్చు గానీ ఇప్పటికే గమ్యస్థానాలకు చేరిన వాటిపై కూడా విధించడం సరికాదని ఆయన పేర్కొన్నారు. భారత ఎగుమతులపై భౌగోళికరాజకీయ పరిణామాల ప్రభావాలను పరిశీలించేందుకు ప్రభుత్వం ఇప్పటికే అంతర్ మంత్రిత్వ శాఖల బృందాన్ని ఏర్పాటు చేసింది. 2024-25 లో పశ్చిమాసియా దేశాలకు భారత్ నుంచి ఎగుమతులు 58.8 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

**కన్సైన్‌మెంట్స్ నిలిపివేత ..**

ఓవైపు అదనపు సర్‌చార్జీలతోనే సతమతమవుతుంటే మరోవైపు, పశ్చిమాసియా దేశాలకు కన్సైన్‌మెంట్‌స్‌ను తీసుకోవడాన్ని షిప్పింగ్ సంస్థలు నిలిపివేయడం ఎగుమతిదారులకు ఇంకో సమస్యగా మారింది. నౌకలు నిల్చిపోయి కంటైనర్ల కొరత ఏర్పడటంతో సముద్ర మార్గంలో రవాణా వ్యయాలు 50 శాతం ఎగిసినట్లు ఎగుమతిదారులు చెప్పారు. అటు విమానాల ద్వారా రవాణా పెరిగినప్పటికీ ఇది ఖరీదైన వ్యవహారంగా ఉంటోంది. కోల్‌కతా నుంచి పశ్చిమాసియాకు వెళ్లే కొన్ని ఎయిర్‌లైన్స్ సరుకు రవాణా చార్జీలను కేజీకి రూ. 175 నుంచి రూ. 425కి పెంచేశాయని సహాయ్ తెలిపారు. ఈ సవాళ్ల వల్ల అంతర్జాతీయ మార్కెట్లలో దేశీ ఉత్పత్తుల ధరలు పెరిగిపోయి, మన పోటీ సామర్థ్యాలకు ప్రతికూలంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

# భారత్ కనెక్ట్ ఈ-చలాన్..

## ఏపీ, తెలంగాణలో భారీ స్పందన


భారత్ కనెక్ట్ ప్లాట్‌ఫామ్‌లో ప్రారంభించిన ఈచలాన్ సేవకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో మంచి స్పందన లభిస్తోంది. 2025 అక్టోబర్ నుంచి ఏపీ ట్రాఫిక్ పోలీస్ విభాగంలో 4.5 లక్షలకు పైగా, తెలంగాణ ట్రాఫిక్ పోలీస్ విభాగంలో 1.3 లక్షలకు పైగా లావాదేవీలు నమోదయ్యాయి. ఫిబ్రవరి 2026లోనే ఏపీలో 1.02 లక్షలు, తెలంగాణలో 22,882 లావాదేవీలు జరిగాయి. భారత్ కనెక్ట్ ద్వారా ట్రాఫిక్ చలాన్ వివరాలు తెలుసుకుని డిజిటల్‌గా చెల్లించే వెసులుబాటు లభిస్తోంది. దీనిపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు హైదరాబాద్‌లో డ్రోన్ ప్రచారం కూడా నిర్వహించారు. ప్రధాన ట్రాఫిక్ కూడళ్ల వద్ద ఇంటరాక్టివ్ స్క్రీన్‌లను డ్రోన్‌ల ద్వారా ప్రదర్శిస్తూ ఈచలాన్ సేవపై ప్రచారం చేశారు. ప్రస్తుతం 700కు పైగా యాప్‌లు, బ్యాంకుల ద్వారా ఈ సర్వీసు అందుబాటులో ఉంది.ఢిల్లీ, గుజరాత్‌లో కూడా ఈ కేటగిరీ ప్రస్తుతం అందుబాటులో ఉంది. "భారత్ కనెక్ట్‌లోని ఈచలాన్ సేవ, డిజిటల్ అప్‌గ్రేడ్ మాత్రమే కాదు. ప్రభుత్వ సంస్థలు, టెక్నాలజీ ప్లాట్‌ఫాంలు కలిసి పని చేస్తే పౌరులకు అందించే సేవలను సరికొత్తగా నిర్వచించేందుకు వీలవుతుందని తెలియజెప్పేందుకు ఇదొక శక్తివంతమైన ఉదాహరణ. ఈ ప్రయత్నంలో మాకు సహకరించిన ఆంధ్రప్రదేశ్ ట్రాఫిక్ పోలీస్, తెలంగాణ ట్రాఫిక్ పోలీస్ శాఖలకు కృతజ్ఞతలు. ప్రజలకు అవసరమైన కీలక చెల్లింపులను డిజిటల్ రూపంలో అందుబాటులోకి తేవడంలో ఇది కీలక అడుగు," అని ఎన్‌బీబీఎల్ (NBBL) ఎండీ & సీఈఓ నూపూర్ చతుర్వేది తెలిపారు.

# టాటా సియెర్రా వాచ్.. కేవలం 500 మాత్రమే!

టాటా మోటార్స్ లాంచ్ చేసిన సియెర్రా కారు అమ్మకాల్లో దూసుకెళ్తోంది. ఇలాంటి సమయంలో ఢిల్లీకి చెందిన ఒక వాచ్ కంపెనీ సియెర్రా పేరుతో లిమిటెడ్ ఎడిషన్ వాచ్ లాంచ్ చేసింది. దీని ధర రూ. 16999. టాటా సియెర్రా వాచ్‌ను కంపెనీ కేవలం 500 మందికి మాత్రమే విక్రయించనున్నట్లు సమాచారం. స్టైలిష్ డిజైన్ కలిగిన ఈ వాచ్.. ఢిల్లీ వాచ్ కంపెనీ లోగో, సియెర్రా పేరును పొందినట్లు తెలుస్తోంది. సాధారణ వాచ్‌లో మాదిరిగా.. ఇందులో కూడా 3,6,9, 12 గంటలను సూచించే గుర్తులు ఉన్నాయి. ఫ్లాగ్‌షిప్ స్నీకర్, టోపోగ్రాఫిక్ లైన్లు, గుర్రం చిహ్నం వంటివి ఇందులో కనిపిస్తాయి.

**సియెర్రా 10000 యూనిట్ల డెలివరీ!**

టాటా మోటార్స్ తన సియెర్రా కారును లాంచ్ చేసినప్పటి నుంచి 10000 కార్లను డెలివరీ చేసింది. 2025 డిసెంబర్ 16న దీనికోసం బుకింగ్స్ మొదలయ్యాయి. డెలివరీలు 2026 జనవరి 15 నుంచి ప్రారంభమయ్యాయి. మార్కెట్లో లాంచ్ అయిన టాటా సియెర్రా ప్రారంభ ధర రూ. 11.49 లక్షలు (ఎక్స్‌షోరూమ్). ఇది నాలుగు వేరియంట్లు, మూడు పవర్ ట్రెయిన్ ఆప్షన్లు, ఆరు కలర్ స్కీంలలో లభిస్తుంది. సియెర్రా క్యాబిన్ కర్వ్ మాదిరిగానే ఉంటున్నప్పటికీ టాటా డిజైన్ లాంగ్వేజ్‌కు ట్రిపుల్ స్క్రీన్ లేఅవుట్, సౌండ్ బార్‌తో 12 స్పీకర్ జేబీఎల్ సౌండ్ సిస్టమ్, హెచ్‌యూడీ, సెంటర్ కన్సోల్ వంటి వాటిలో కొత్తదనాన్ని జోడిస్తుంది. డ్యూయల్‌జోన్ క్లైమేట్ కంట్రోల్, కనెక్టెడ్ కార్ టెక్నాలజీ, లెవల్ 2 ADAS, 360డిగ్రీల కెమెరా, పవర్డ్, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు ఉన్నాయి. ఐకానిక్ ఆల్పైన్ పైకప్పును ఆధునిక కాలానికి అనుగుణంగా మార్పు చేశారు. సన్ రూఫ్ కాస్త విశాలంగా ఇచ్చారు. టాటా సియెర్రా కారులో ఆరు ఎయిర్ బ్యాగులు, ఏబీఎస్ విత్ ఈబీడీ, స్టెబిలిటీ ప్రోగ్రామ్, ఐసోఫిక్స్ చైల్డ్ సీట్ మౌంటింగ్ పాయింట్లు ఉన్నాయి.



## దేశం-విదేశం | NATIONAL-INTERNATIONAL



# అణ్వాయుధ ప్రోగ్రామ్.. అమెరికాకు ఇరాన్ కండీషన్..!

**అణు కార్యక్రమాన్ని వదులుకుంటున్నట్లు వస్తున్న కథనాలపై ఇరాన్ స్పందించింది. తమకు సంతృప్తికర ప్రత్యామ్నాయ ఆఫర్ ఇస్తేనే.. అణ్వాయుధ ప్రోగ్రామ్‌ను ఆపేస్తామంటూ అమెరికాకు ఇరాన్ షరతు విధించింది. విదేశాంగ శాఖ సహాయ మంత్రి మజిద్ తఖ్త్-రవాంచి ఈ ప్రకటన చేసినట్లు ఇరాన్ ప్రభుత్వ ఆధీనంలోని ఐఆర్ఎన్ఏ (IRNA) వార్తా సంస్థ వెల్లడించింది.**



ఇదిలా ఉండగా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అణు హెచ్చరికను మరోసారి పునరావృతం చేశారు. ఇరాన్‌పై దాడి చేయాలనే నిర్ణయాన్ని ట్రంప్ సమర్థించుకున్నారు. పిచ్చివాళ్ళ దగ్గర అణ్వాయుధాలు ఉన్నప్పుడు, ఇలాంటి చెడు విషయాలు జరుగుతాయంటూ మండిపడ్డారు. ఇరాన్‌పై ఇంకా ఆపరేషన్ ముగియలేదన్నారు. మరోవైపు, పశ్చిమాసియాలో యుద్ధం మరింత భీకర రూపు దాలుస్తోంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా నిప్పుల వర్షం కురిపిస్తోంది. ఇరాన్‌లో ఇప్పటివరకు 1230 మంది మృతి చెందారు. ఇవాళ (మార్చి 5, గురువారం) ఒమన్ పోర్టుపై ఇరాన్ దాడి చేసింది. ఇద్దరు భారతీయులు అశిష్‌కుమార్, దిలీప్ సింగ్ మృతిచెందారు. ఇప్పటిదాకా ఇరాన్‌కు చెందిన 17 యుద్ధ నౌకలను పేల్చేసినట్టు అమెరికా ప్రకటించింది. ఇరాన్‌లో 2,000కు పైగా లక్ష్యాలను ఛేదించినట్టు అమెరికా సైన్యం సెంట్రల్ కమాండ్ చీఫ్, నేవీ అడ్మిరల్ బ్రాడ్ కూపర్ వెల్లడించారు. "వందలాది ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులు, లాంచర్లు, డ్రోన్లను నాశనం చేశాం. ఇరాన్ ఇప్పటిదాకా 500కు పైగా బాలిస్టిక్ క్షిపణులు, 2,000కు పైగా డ్రోన్లు ప్రయోగించింది" అని తెలిపారు.

# ఇరాన్‌పై యుద్ధంలో అమెరికాకు ఓటమి ఖాయం.. కారణాలివే..


**బీజింగ్:** ప్రముఖ చైనీస్‌కెనడియన్ విద్యావేత్త, జియోపొలిటికల్ విశ్లేషకుడు షూఏచిన్ జియాంగ్ (Xueqin Jiang) చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. ఆయన ప్రకారం, అమెరికాఇజ్రాయెల్ సంయుక్త దాడులు ఇరాన్‌పై కొనసాగుతున్నప్పటికీ, ఈ యుద్ధంలో అమెరికా ఓటమి తప్పదని అంచనా వేశారు. జియాంగ్ 'ప్రిడిక్టివ్ హిస్టరీ' పేరుతో యూట్యూబ్ ఛానెల్ నిర్వహిస్తూ, గేమ్ థియరీ ఆధారంగా జియోపొలిటికల్ విశ్లేషణలు చేస్తుంటారు. ఇటీవల విడుదల చేసిన వీడియోలో, అమెరికాఇరాన్ యుద్ధాన్ని ప్రాచీన గ్రీకు చరిత్రలోని అథెన్స్ సిసిలీ యాత్రతో పోల్చారు. ఆయన అభిప్రాయం ప్రకారం, అధిక ఖర్చులు, వ్యూహపరమైన తప్పిదాలు కారణంగా అమెరికా ఈ యుద్ధంలో ఓడిపోతుందని చెప్పారు. 1976లో చైనాలో జన్మించిన జియాంగ్, యేల్ యూని



వర్సిటీలో ఇంగ్లీష్ సాహిత్యంలో డిగ్రీ పూర్తి చేశారు. ప్రస్తుతం బీజింగ్‌లోని మూన్‌షాట్ అకాడమీలో చరిత్ర, తత్వశాస్త్రం బోధిస్తున్నారు. విద్యా రంగంలో ఆయన చేసిన సంస్కరణలు, సృజనాత్మకతను ప్రోత్సహించే ప్రయత్నాలు ఆయనను ప్రత్యేకంగా నిలబెట్టాయి. 2024లో ఆయన ఇచ్చిన ఒక లెక్చర్‌లో, అమెరికాఇరాన్ యుద్ధం తప్పనిసరిగా జరుగుతుందని, అది అథెన్స్ సిసిలీ యాత్ర లాంటి ఘోర పరాజయానికి దారితీస్తుందని చెప్పారు. ఆయన అంచనాలు ఇప్పటివరకు నిజమవుతున్నందున, ప్రపంచవ్యాప్తంగా ఆయనను చైనాకు చెందిన నోస్ట్రాడమస్‌గా అభివర్ణిస్తున్నారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో దాడులు, ప్రతిదాడులు కొనసాగుతున్న నేపథ్యంలో, జియాంగ్ చేసిన విశ్లేషణలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. చరిత్ర ఆధారంగా భవిష్యత్తు అంచనా వేసే ఆయన విధానం, గేమ్ థియరీ వినియోగం, జియోపొలిటికల్ విశ్లేషణలు అంతర్జాతీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. మొత్తానికి, షూఏచిన్ జియాంగ్ ఒక విద్యావేత్త మాత్రమే కాకుండా, చరిత్రను ఆధారంగా చేసుకుని భవిష్యత్తు అంచనా వేసే విశ్లేషకుడిగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతున్నారు.


# మూడోసారి ప్రయోగించిన 69 సెకన్లకే పేలిపోయిన జపాన్ రాకెట్

**టోక్యో:** జపాన్ ప్రైవేట్ అంతరిక్ష సంస్థ స్పేస్ వన్ మరోసారి ఘోరంగా విఫలమైంది. ఆ సంస్థకు చెందిన కైరోస్ నం.3 రాకెట్ ప్రయోగించిన 69 సెకన్ల తర్వాత గాల్లోనే పేలిపోయింది. ఇలా జరగడం వరుసగా మూడోసారి. ప్రైవేటు రంగంలో అంతరిక్ష రంగాన్ని విస్తరించాలని ప్రయత్నాలు చేస్తున్న జపాన్‌కు ఇది గట్టి ఎదురుదెబ్బ. కైరోస్ రాకెట్ ఘన ఇంధనంతో పని చేస్తుంది. దాని ఎత్తు 18 మీటర్లు. పశ్చిమ జపాన్‌లోని స్పేస్‌పోర్ట్ కీ అనే ప్రైవేట్ ప్రయోగ వేదిక నుంచి ఈ ప్రయోగాన్ని ఇవాళ ఉదయం 7:40 గంటలకు జరిపారు.రాకెట్ నిర్వహణ బాధ్యత జపాన్ సంస్థ స్పేస్ వన్‌ది. ఇందులో 5 ప్రయోగాత్మక ఉపగ్రహాలు ఉన్నాయి. టోక్యోకు చెందిన ఆర్క్ ఎడ్జ్ స్పేస్ సంస్థ తయారు చేసిన పరికరాలు, తైవాన్ అంతరిక్ష సంస్థ ఉపగ్రహాలు కూడా ఇందులో ఉన్నాయి. రాకెట్ విజయవంతంగా ఎగిరినప్పటికీ కొద్ది సమయంలోనే పేలిపోయింది. అందువల్ల కక్ష్యలోకి చేరుకోలేకపోయింది. ప్రయోగం ప్రారంభమైన కొద్దిసేపటికే రాకెట్ అస్థిర మార్గంలో వెళ్లినట్లు కనిపించింది. అనంతరం పసిఫిక్ మహాసముద్రం పైభాగంలో 29 కిలోమీటర్ల ఎత్తులో దాని ప్రయాణం ఆటోమేటిక్‌గా ముగిసింది. స్పేస్ వన్ ఉపాధ్యక్షుడు నోబుహిరో సెకినో మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రయోగం ప్రారంభించిన సమయంలో, రాకెట్ పరికరాల్లో తమకేమీ లోపాలు కనిపించలేదని తెలిపారు. అయితే, ఆటోనొమస్ టెర్మినేషన్ సిస్టమ్ వ్యవస్థలో లోపం జరిగి ఉండవచ్చని చెప్పారు.వరుసగా మూడో వైఫల్యం స్పేస్ వన్ కైరోస్ రాకెట్‌కు ఇది వరుసగా మూడో వైఫల్యం. ఇదే రాకెట్ 2024లో జరిగిన రెండు ప్రయోగాల్లో కూడా విఫలమైంది. స్పేస్ వన్ సంస్థ జపాన్ కంపెనీల



సంయుక్త ప్రాజెక్టులను కొనసాగిస్తుంది. ఆప్టికల్ ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థ కానన్, ఏరోస్పేస్ సంస్థ ఐహెచ్ఐ, నిర్మాణ సంస్థ షిమిజు వంటి కంపెనీలు ఇందులో పెట్టుబడులు పెట్టాయి.గత ఏడాది జపాన్ మొత్తం 3 రాకెట్ ప్రయోగాలు మాత్రమే చేసింది. 2030 నుంచి ప్రతి సంవత్సరం 30 ప్రయోగాలు చేయాలన్న లక్ష్యాన్ని పెట్టుకుంది. అయితే, ఆ దిశగా విజయాలు సాధించడం లేదు. రక్షణ అవసరాలు పెరుగుతున్న పరిస్థితి, చైనా అంతరిక్ష ప్రోగ్రాం వేగంగా విస్తరించటం కారణంగా జపాన్‌పై ఒత్తిడి పెరిగింది. దేశీయంగా రాకెట్లు అభివృద్ధి చేసి అమెరికా రాకెట్లపై ఆధారపడడాన్ని తగ్గించాలని జపాన్ ప్రయత్నిస్తోంది.

# స్కూళ్లు బంద్.. సీబీఎస్ఈ పరీక్షలు వాయిదా



**దుబాయ్:** పశ్చిమ ఆసియాలో నెలకొన్న ప్రాంతీయ ఉద్రిక్తతల నేపథ్యంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (UAE) ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలోని పాఠశాలలు, విశ్వవిద్యాలయాలకు ముందస్తుగా 'స్ప్రింగ్ బ్రేక్' (వసంతకాల సెలవులు) ప్రకటించడమే కాకుండా, విద్యా సంవత్సరం రెండో విడత (టర్మ్2) గ్రేడింగ్ విధానంలోనూ సమూల మార్పులు చేసింది. విద్యా మంత్రిత్వ శాఖ వెల్లడించిన ఆదేశాల ప్రకారం షెడ్యూల్ కంటే ఒక వారం ముందుగానే, అంటే మార్చి 9వ తేదీ నుండి మార్చి 22 వరకు విద్యా సంస్థలన్నీ మూతపడనున్నాయి. సాధారణంగా మార్చి 16 నుండి ప్రారంభం కావాల్సిన ఈ సెలవులను, ప్రస్తుతం నెలకొన్న క్షిపణి, డ్రోన్ దాడుల ముప్పులను దృష్టిలో ఉంచుకుని మార్చి 9వ తేదీకి మార్చారు. ఈ నిర్ణయం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతో పాటు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విశ్వవిద్యాలయాలకు, బోధన, బోధనేతర సిబ్బందికి కూడా వర్తిస్తుంది. ఈ ఆకస్మిక మార్పుల నేపథ్యంలో విద్యార్థుల విద్యా ఫలితాలపై ప్రభావం పడకుండా ఉండేందుకు టర్మ్2 మూల్యాంకన విధానాన్ని ప్రభుత్వం వెల్లడించింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల మార్కులను ప్రస్తుత సెమిస్టర్లో వారు పూర్తి చేసిన ప్రాజెక్టులు, అసైన్‌మెంట్ల ఆధారంగా నిర్ణయించనున్నారు. ప్రైవేటు పాఠశాలల విషయానికొస్తే, ఆయా విద్యా సంస్థలు తమ సొంత విద్యా విధానాలకు అనుగుణంగా మూల్యాంకన పద్ధతులను ఎంచుకునే వెసులుబాటును కల్పించారు. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (CBSE) ఇప్పటికే మార్చి 5, 6 తేదీల్లో మిడిల్ ఈస్ట్‌లో జరగాల్సిన 10, 12 తరగతుల బోర్డు పరీక్షలను వాయిదా వేసింది. యూఏఈతో పాటు సౌదీ అరేబియా, ఖతార్, ఒమన్, కువైట్, బహ్రెయిన్, ఇరాన్ దేశాల్లోని విద్యార్థులకు ఇది వర్తిస్తుంది.

# ఇజ్రాయెల్‌లోని అణు కేంద్రంపై దాడి చేస్తాం: ఇరాన్ సంచలనం

టెహ్రాన్: ఇజ్రాయెల్‌లోని డిమోనా అణు కేంద్రంపై దాడి చేస్తామని ఇరాన్ వార్నింగ్ ఇచ్చింది. అమెరికాఇజ్రాయెల్ దాడిలో మృతి చెందిన ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ పార్థివ దేహాన్ని ఉంచేందుకు టెహ్రాన్ గ్రాండ్ మోసల్లాలో ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఇవాళ ఇరాన్ ప్రభుత్వ మీడియా పలు వివరాలు తెలిపింది. సుప్రీం లీడర్‌కు తుది వీడ్కోలు తెలపడంలో భాగంగా 3 రోజులు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వేలాది మంది సంతాపం తెలిపేందుకు మోసల్లా వద్దకు చేరుకునే అవకాశం ఉంది. సుప్రీం లీడర్ మరణం తర్వాత సాధారణంగా "వీడ్కోలు కార్యక్రమం", ఆ తర్వాత "అంతిమ యాత్ర" నిర్వహించడం అక్కడి ఆచారం. ఇదిలా ఉండగా, ఇస్లామిక్ రిపబ్లిక్‌ను కూల్చే ప్రయత్నం జరిగితే ఇజ్రాయెల్‌లోని డిమోనా అణు కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకుంటామని గురువారం ఇరాన్ హెచ్చరించింది.ఇరాన్‌లో కొత్త సుప్రీం లీడర్ వస్తే అతడిని కూడా టార్గెట్ చేస్తామంటూ ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కాట్జ్ వార్నింగ్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డిమోనా అణు కేంద్రాన్ని టార్గెట్ చేస్తామంటూ ఇరాన్ హెచ్చరించడం గమనార్హం. ఇజ్రాయెల్ రక్షణ దళాలు తెలిపిన వివరాల ప్రకారం.. ఇరాన్ మరోసారి దాడులు ప్రారంభించింది. మధ్య ఇజ్రాయెల్ ప్రాంతాలు, జెరూసలేం పరిసరాలు, పశ్చిమ తీర ప్రాంతం భాగాల్లో సైరన్లు మోగాయి. ఇజ్రాయెల్, అమెరికా దాడులకు ప్రతిస్పందనగా ఆపరేషన్ ప్రారంభించామని ఇరాన్ పేర్కొంది.అమెరికా, ఇజ్రాయెల్‌కు చెందిన 7కు పైగా ఆధునిక రాడార్ వ్యవస్థలు ధ్వంసం అయ్యాయని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కాప్స్ (ఐఆర్‌జీసీ) ప్రకటించింది. ఈ దాడులతో ఆ దేశాల నిఘా వ్యవస్థలు పనిచేయకుండా చేశామని పేర్కొంది. ఇరాన్ ప్రయోగించిన క్షిపణులు ఇజ్రాయెల్ రక్షణ కోసం ఏర్పాటు చేసిన థాడ్ క్షిపణి నిరోధక వ్యవస్థను ఛేదించి మరీ దూసుకెళ్లి పలుచోట్ల తాకినట్లు ఐఆర్‌జీసీ పేర్కొంది. టెల్ అవీవ్‌లోని ఇజ్రాయెల్ రక్షణ మంత్రిత్వ శాఖ భవనాల సముదాయం, బెన్ గురియన్ విమానాశ్రయం కూడా లక్ష్యాల్లో ఉన్నాయని తెలిపింది. ఈ థాడ్ క్షిపణి నిరోధక వ్యవస్థ అమెరికాకు చెందింది. గగనతలంలో శత్రుదేశాల క్షిపణులను అడ్డుకునే రక్షణ వ్యవస్థ ఇది. వాటిని దాటుకుని మరీ తమ క్షిపణులు దూసుకెళ్లాయని ఇరాన్ అంటోంది. ఐఆర్‌జీసీ తెలిపిన వివరాల ప్రకారం.. ఇరాన్ కొనసాగిస్తున్న క్షిపణిడ్రోన్ దాడులతో ఇజ్రాయెల్‌లోఏని అనేక ప్రాంతాల్లో గంటల తరబడి సైరన్‌లు మోగాయి. ప్రజలు చాలా సేపు సురక్షిత ప్రాంతాల్లో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాబోయే రోజుల్లో దాడులు మరింత తీవ్రంగా, విస్తృతంగా ఉంటాయని ఇరాన్ హెచ్చరించింది.

# తను పుట్టాక ప్రపంచమే ఆగిపోయింది!

గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా 2018లో సింగర్ నిక్ జోనస్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. వీరికి 2022లో సరోగసి ద్వారా కూతురు మాల్తీ మేరీ జన్మించింది. అయితే పుట్టినప్పుడు బిడ్డ ఆరోగ్యంగా లేకపోగా ఆమెకు రక్తమార్పిడి చేయాల్సి వచ్చింది. పొత్తిళ్లలో ఎత్తుకుని నవ్వులు పంచాల్సిన చిన్నారి ఆపరేషన్ థియేటర్‌లో పోరాడుతుంటే ప్రియాంక దంపతుల మనసు తల్లడిల్లిపోయింది. కానీ, వీరి ప్రార్థనలు ఫలించి మాల్తీ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగొచ్చింది.

### మిరాకిల్ బేబీ

ఆనాటి సంగతులను తాజాగా ఓ ఇంటర్వ్యూలో గుర్తు చేసుకుంది ప్రియాంక చోప్రా. ప్రియాంక మాట్లాడుతూ.. నాకు ప్రెగ్నెన్సీలు కలిసిరాలేదు. చాలా కష్టాలు చూశాను. అప్పుడు నాకు (సరోగసి ద్వారా) మిరాకిల్ బేబీ పుట్టింది. తను ఈ ప్రపంచంలో అడుగుపెట్టిన మరుక్షణం నాకింక ఏమీ కనిపించలేదు. సమస్తం ఆగిపోయినట్లే అనిపించింది.

### మాల్తీ ఏం చేస్తుందో?

కాకపోతే తనగురించి ఎప్పటికీ భయపడుతూనే ఉంటాను. తను స్కూల్‌లో ఉన్నా.. నేను వేరే దేశంలో ఉన్నా.. మాల్తీ ఏం చేస్తుందో? ఎలా ఉందో? అని నా గుండె తనకోసమే కొట్టుకుంటూ ఉంటుంది. తను జోక్స్ చెప్తుంది, గొంతెత్తి పాడుతుంది. నన్ను, నా భర్తను, మా కుటుంబం మొత్తాన్ని ఎప్పటికప్పుడు సర్‌ప్రైజ్ చేస్తూనే ఉంటుంది. నా జీవితంలో తనే గొప్ప బహుమతి.

### నా ఆలోచనంతా తన చుట్టూనే..

తను వచ్చాకే నా ప్రాధాన్యతలన్నీ మారిపోయాయి. మొదటి, చివరి ఆలోచన తన గురించే ఉంటుంది అని చెప్పుకొచ్చింది. ప్రియాంక ఇటీవలే ద బ్లఫ్ అనే హాలీవుడ్ సినిమాతో ప్రేక్షకులను పలకరించింది. ప్రస్తుతం వారణాసి అనే సినిమా చేస్తోంది. రాజమౌళి దర్శకత్వం మహేశ్‌బాబు హీరోగా నటిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది వేసవిలో విడుదల కానుంది.



# ఇండియా వదిలేస్తా ఇరాన్ వెళ్లిపోతా..

## బాలీవుడ్ నటి సంచలన ప్రకటన

దుబాయ్ సహా పశ్చిమాసియాలో చిక్కుకున్న బాలీవుడ్ నటీనటులు కావచ్చు ఇతర సెలబ్రిటీలు అందరూ ఇండియాకు వచ్చేదారులు ఎక్కడా అని వెదుక్కుంటుంటే...హాయిగా ఇండియాలో కూర్చుని సినిమాలు చేసుకుంటున్న ఓ బాలీవుడ్ నటి మాత్రం ఇక తాను ఇక్కడ ఉండలేనంటోంది. ఈ యుద్ధానికి కేంద్ర బిందువైన ఇరాన్‌కే వెళ్లిపోతానంటోంది. ఇంతకీ ఎవరా నటి ఎందుకీ విరక్తి?

ఆమె పేరు మందనా కరిమి, ఇరాన్‌కు చెందిన సినీ తార. కొన్నేళ్ల క్రితమే ఫ్యాషన్ రన్ వేలపై అడుగులతో మన దేశంలో ప్రారంభమై అక్కడ నుంచి బాలీవుడ్ దాకా సాగింది. భారత మోడలింగ్ రంగంలో స్థిరపడిన తర్వాత, ఆమె భాగ్ జానీ క్యా కూల్ హై హమ్ 3 వంటి చిత్రాలలో వరుసగా ఛాన్స్‌లు దక్కించుకుంది. ఫ్యాషన్, ప్రకటనలు రియాలిటీ టెలివిజన్ ద్వారా కూడా ఇండియా ఆమెను ఆదరించింది. మరోవైపు ప్రస్తుత ఇరాన్–అమెరికా –ఇజ్రాయెల్ ఉద్రిక్తతల తర్వాత తన చుట్టూ పరిస్థితి మారిపోయింది అంటోందీమె. ఇరాన్ లో జన్మించిన ఈ నటి ఇప్పటిదాకా తన చుట్టూ స్నేహితులుగా ఉన్నవారిలో వచ్చిన మార్పులు తనకు అంతుపట్టడం లేదని వాపోతోంది.

ఈ పరిస్థితుల్లో తనకు ఇండియాలో ఉండడం నచ్చడం లేదని, ఇక పెట్టేబేడా సర్దుకుని ఇరాన్‌కి వెళ్లిపోవడమే శరణ్యం అనీ స్పష్టం చేస్తోంది. తనకు ఇండియా ఎంతో ఇచ్చింది. కానీ...వాయిస్ మాత్రం ఇవ్వలేదంటోంది. అదే విధంగా మరో ఇరాన్ నటి ఎల్నాజ్ నౌరోజీ ఇరాన్ నేత తాజా దాడుల్లో మృతి చెందిన అహ్మద్ ఖొమేని మృతి పట్ల భారత్‌లో కొందరు ముస్లింలు చేపట్టిన నిరసన ప్రదర్శనలను ఆక్షేపిస్తోంది. మతం పేరుతో ఖొమేని సాగించిన అరాచకాల గురించిన అవగాహన లేకపోవడమే దీనికి కారణం కావచ్చునని ఆమె అభిప్రాయపడుతోంది. ఈ నటి దాదాపు దశాబ్దం క్రితం భారతదేశానికి వచ్చింది నెట్‌ఫ్లిక్స్ సేక్రెడ్ గేమ్స్ ద్వారా వేగంగా పాప్యులారిటీ అందుకుంది.

వీరు కాకుండా భారత్‌లోని మరికొందరు ఇరానియన్ మూలాలున్న నటీనటులు ఎవరంటే...
ఇరానియన్ నటుడు సజ్జాద్ డెలాఫ్రూజ్ సల్మాన్ ఖాన్ సరసన టైగర్ జిందా హైలో శక్తివంతమైన పాత్ర ద్వారా బాలీవుడ్‌లోకి ప్రవేశించాడు. తరువాత గూఢచర్య థ్రిల్లర్ స్పెషల్ ఆప్స్‌లో కనిపిస్తాడు.బాలీవుడ్ యాక్షన్ స్టార్ జాన్ అబ్రహం తన తల్లి, ఇరానియన్ జొరాస్ట్రియన్ ద్వారా ఇరానియన్ మూలాలను కలిగి ఉన్నారనే విషయం చాలా తక్కువ మందికి తెలుసు.ఇడియట్స్ మున్నాభాయ్ ఎంబిబిఎస్ చిత్రాల్లోని పాత్రలతో పేరొందిన ప్రముఖ నటుడు బోమన్ ఇరానీ కూడా ముంబైలోని ఇరానియన్ జొరాస్ట్రియన్ కుటుంబానికి చెందిన వ్యక్తి..



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com